# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 41 సంచిక 2
పేజీలు 44
అక్టోబర్ 2021

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


దాశరథీ శతకము ............................ ..........4

శ్రీబాబూజీ ఉవాచ....................................... 5

అమ్మమాట.................................. ............ 7

అగస్త్య హృదయం ....................... ..............9

సుందరకాండ ఎందుకు చదవాలి? 11

మాయ ...............................................................13

అదృశ్య శక్తి అన్నీ గమనిస్తూనే వుంటుంది................ ..................16

ఛాందోగ్యోపనిషత్ సారము ........... .17

మీకో బహుమతి ...................... .......................19

లోపం .. ................. ....................................... 21

బాబూజీతో అనుభవాలు ............................25

లక్ష్మి .......................... ................ ............... 27

నిందా స్తుతులు ......................... ...................30

కైవల్యోపనిషత్ ... ..........................................31

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు .....................33

శ్రీ మూర్తి నాయనారు.... .............................34

సగటు మనిషి ఆత్మ నివేదన ...............36

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38

విష్ణు కథలు ....... ............................ ...................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

15) హరునకు నవ్విభీషణునక ద్రిజకుం దిరుమంత్ర రాజమై
కరికి నహల్యకుం ద్రుపదకన్యకు నార్తిహరించుచుట్టమై
పరగినయట్టి నీపతిత పావననామము జిహ్వపై నిరం
తరము నటింపజేయుమిక దాశరథీ కరుణాపయోనిధీ!

భావం - నీ నామ మీశ్వరునకు, విభీషణునకు, పార్వతికిని శ్రేష్ఠమగు మంత్రమైనది. గజేంద్రునికి, అహల్యకు, ద్రౌపదికి ఆర్తిని హరించు చుట్టమైనట్టిది. అట్టి పరమ పవిత్రమైన నీ నామము నా నాలుకయందెప్పుడు నాడునట్లు చేయుము.




*విత్తానికి వున్న మూడు గతులు ఏమిటి?
*సత్సంగం ఏమి నేర్పిస్తుంది?
*పొందినదే పొందడం, వదిలినదే వదలడం అంటే ఏమిటి?
*మన అందరి అకౌంట్లలో ప్రతిరోజూ పడే ధనం ఏమిటి?
*చిన్న బలహీనతే కదా అని వదిలి వేస్తే ఏమౌతుంది?
*తన చేతులనే చందనంలాగా అరగదీసిన భక్తుడెవరు?
*భగవంతుడు కూడా క్షమించలేని తప్పిదాలను క్షమించే శక్తి ఎవరికి వున్నది?
*ప్రశాంతమైన హృదయం కావాలంటే ఏం చేయాలి?
*సినిమా పాటలు కూడా సాధనకు ఉపయోగపడతాయా?
*మల్లికార్జునుని స్థానం ఏది?

*సమాధానాలు లోపలి పేజీలలో............................*

## శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

24-11-1980

ఈరోజు శ్రీ బాబూజీ దర్శనం ఇచ్చినపుడు చరణ్‌దాస్ 'అభిషేకం అంటే ఏమిటి?' అని ప్రశ్నించాడు. 'చెప్పవయ్యా వెంకటరత్నం' అన్నారు శ్రీ బాబూజీ. 'స్వామిని అభ్యంగన స్నానం చేయించటం' అన్నారు వెంకట రత్నంగారు.



"ఈవేళ మధ్యాహ్నం 12 గం॥ల వరకు అభిషేకాలు జరుగుతూనే వున్నాయి. బొటనవ్రేలుకన్న చిన్నది లింగం చూశారా ఎన్ని అభిషేకాలో! రకరకాల అభిషేకాలు. బియ్యంతో, పాలతో, పెరుగుతో, పెసలతో, మినుములతో, నువ్వులతో రకరకాలు. అందరికి వారివారి స్థితులనుబట్టి సత్ఫలితాలనే ఇచ్చింది. రాజమండ్రి నుంచి చౌదరిగారు వచ్చారు. ఆయన అభిషేకం చేసుకోగానే వారి సమస్యలు తీరిపోయాయి. కాని ఆయన తిరిగి రాలేదు. కనీసం ఉత్తరం అయినా లేదు.

కాని ఆయన బంధువులొకరు బళ్ళారినుంచి వచ్చారు. వారి సమస్యలతో వారు కూడా అభిషేకం చేసుకున్నారు. వారి సమస్య తీరింది. వారు ఉత్తరం వ్రాశారు.

అలాగే అనేక రకాల దీక్షలు. ఈ అభిషేకాలు, దీక్షలు బయట చేసుకున్నారనుకోండి. చాలా డబ్బు ఖర్చవుతుంది. బ్రాహ్మలకు ఒక్కొక్కరికి 25 రూపాయిలు చొప్పున 25 మందికి ఇవ్వాలి. అదే 625 అవుతుంది. ఇంకా పుష్పాలు వగైరా ఖర్చు. పైగా వారు గుర్రపు అడుగుల లాగా మంత్రాలని దాటేస్తారు. ఈ విధంగా ఎవరూ చేయరు.

అభిషేకం అంటే శాస్త్రోక్తంగా మనస్ఫూర్తిగా ఆ పరమేశ్వరుడిని మనస్సులో నిల్పుకొని ప్రార్థించటం, అంతేకాని నీటితో స్నానం చేయించటం కాదు. ఆ రూపం మనస్సులో నిల్చిపోవాలి.

ఒకసారి మౌనస్వామి ఉన్నప్పుడు నేను శ్రీశైలం వెళ్ళాను. అప్పుడు అభిషేకం చేసేటపుడు, ఆ మల్లిఖార్జునుడు:

'నాస్థానం ఏదీ?' అని ప్రశ్నించాడు.

'నా మనస్సు' అన్నాను. అన్నారు శ్రీ బాబు.

'ఆత్మలో స్వామి లయిస్తే ఇంకేముంది! వెంకటరత్నం నువ్వు వచ్చావా?' అడిగారు శ్రీ బాబూజీ.

'రెండుసార్లు వచ్చాను' అన్నారు వెంకటరత్నంగారు.

'ఏమి లాభం? పద్మము వద్దనున్న కప్ప' అన్నారు శ్రీబాబూజీ.

మౌనస్వామి ప్రసక్తి వచ్చింది. "ఆయన మహాత్ముడు. 1968లో సిద్ధిపొందాడు. మనం 1978లో వెళ్ళినపుడు ఆయన లేరు" అన్నారు శ్రీ బాబు. అంతలో పేపరులో పడ్డ శ్రీ బాబూజీ ఉపన్యాసం చదివాం. "బాగుంది కదూ! నిజంగా ఇంత బాగా నేను చెప్పానా!" అన్నారు శ్రీ బాబూజీ.

వీరబ్రహ్మంగారు ఎవరు? అని విఠల్ అడిగారు.

"వీరబ్రహ్మంగారు వీరుడే. బ్రహ్మంగారు సాక్షాత్తు మహేశ్వరుడు. ఆయన శిష్యుడు సిద్దయ్య విష్ణుమూర్తి. దూదేకుల కుటుంబంలో జన్మించారు. అయితేనేం అన్నారు. బ్రహ్మంగారి పుత్రికలు జ్ఞానులు. కాని పుత్రులు మాత్రం కాదు" అన్నారు శ్రీ బాబూజీ.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, విజయవాడ వాస్తవ్యులు శ్రీమతి యెడమ బాలా త్రిపుర సుందరిగారు (చందూ గారి భార్య) 9-9-2021 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 52 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

**_కామ, క్రోధ, లోభ, మోహ నాశిని అమ్మ_**

గంటలనీ, రోజులనీ, సంవత్సరాలనీ కూడా మరపింపజేసే శక్తి దేనిలో వున్నదని విచారణ చేస్తే, అది కేవలం భగవద్విచారణలో మన మనస్సు లీనమైనప్పుడు మాత్రమే అని తెలుస్తుంది. అది ఎప్పుడు, ఎలా సాధ్యమవుతుంది? అది కేవలం మన మనసులో నుండి ఈర్ష్య, అసూయ, అసహనం, ఓర్వలేనితనం ఇత్యాది మలిన గుణాలు రహితమైనప్పుడు మాత్రమే సాధ్యం అవుతుంది. మనం ఈ ఏడాది ఎలా గడిపామో అని ఆలోచిస్తే, కేవలం భగవన్నామ స్మరణ, చింతనతోనే గడపగలిగాం అన్నదానిలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ప్రపంచమంతా అతలాకుతలమైపోయింది. కానీ, ఈనాడు ఆ సమస్యలన్నింటినీ ఎదుర్కొనే శక్తినిచ్చింది కేవలం భగవచ్ఛక్తి మాత్రమే. ప్రపంచం నలుమూలలా



మహాత్ముల మార్గ దర్శకత్వంలో, సర్వజనులూ చేసిన ప్రార్థనాదికాలు, భగవన్నామ స్మరణ, యజ్ఞ యాగాదుల వలన ఈనాడు ఈ మాత్రం శాంతి, స్వస్థత చేకూరింది.

చైత్రంలో శ్రీరామునిగా, వైశాఖం, ఆషాఢంలో సద్గురు స్వరూపంగా, శ్రావణంలో జగన్మాత లక్ష్మీ స్వరూపంగా మరియు శ్రీకృష్ణ స్వరూపంగా, భాద్రపదంలో విఘ్నేశ్వర రూపంలోనూ సేవించుకుని, ఈనాడు ఆశ్వీయుజంలో ఆ అనంతశక్తిని శ్రీమహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ, శ్రీ చక్రరాజ రాజేశ్వరీ స్వరూపంగా ఆరాధించుకో బోతున్నాం. సద్గురుదేవులైన శ్రీబాబూజీ మహరాజ్‌వారు మనకు ప్రసాదించిన మహత్తరమైన సంపద శ్రీజగన్మాత నవరాత్రుల దీక్ష. సాక్షాత్తూ జగన్మాత స్వరూపమే తామైవుండి కూడా, మనకు నేర్పించడం కోసం స్వామివారే నవరాత్రి దీక్షను స్వీకరించి, ఎంతటి నియమ నిష్ఠలతో జగన్మాతని సేవించాలో, పూజించాలో మనకి నేర్పించారు. నిత్య ప్రార్థన, పూజాదికాలు ఎన్ని వున్నా శ్రీగురుదేవులు ఈ నవరాత్రి దీక్షలో పెద్దపీట **సత్సంగానికి** వేశారు.

పూజాదులన్నీ ఒక ఎత్తయితే సత్సంగం ఒక్కటీ ఒకఎత్తు. మనకి

పూజ ఏ భావనతో చేయాలో కూడా నేర్పించేది సత్సంగమే. పూజాదులు కేవలం కాయశుద్ధికోసం మాత్రమే. కానీ మనస్సులో మార్పు రావాలంటే అది కేవలం సత్సంగం వలనే సాధ్యం. మహాత్ముల బోధ శ్రవణం చేయాలి. అదీ శ్రవణం ఎలా చేయాలీ అంటే **'సన్యస్య శ్రవణం కుర్యాత్'** అని చెప్పారు. సన్యసించి శ్రవణం చేయాలి అంటే సన్యాసం పుచ్చుకోవాలేమో అని భయపడకండి. మనస్సులోని సమస్త కోరికలను, గుణాలను, మలిన భావాలను వదిలివేయడమే నిజమైన సన్యాసం. అటువంటి శుద్ధ మనస్సుని ఏకాగ్రపరచి, భగవత్తత్వాన్ని శ్రవణం చేయాలి. శ్రవణం చేసిన దానిని ఒక చెవితో విని, మరొక చెవి నుండి విడిచిపెట్టకూడదు. మహాత్ముల బోధను ఒళ్ళంతా చెవులు చేసుకుని శ్రవణం చేయాలి. విన్నదానిని హృదయంలో పదిల పరచుకుని, తిరిగి మననం చేసుకోవాలి. విన్న బోధను తిరిగి పుస్తకంలో వ్రాసుకుంటే అది మస్తకంలో మరింత గట్టి పడుతుంది. మననం చేయగా చేయగా నిదిధ్యాసకు వస్తుంది. గురుబోధా శ్రవణం మన మనస్సులోని మాలిన్యాన్ని తొలగించి, ప్రవృత్తిని మార్చి, మనని నివృత్తి మార్గానికి తీసుకు వెడుతుంది.

ఆ కాలంలో రాక్షసత్వానికి ఒక రూపం అంటూ వుండేది. కనుక అమ్మ ఒక్కొక్క రూపం దాల్చి, ఆ యా రాక్షసులను సంహరించింది. మరి ఈ కాలం వచ్చేసరికి, ఆ రాక్షసులు ఆసురీ గుణాలుగా మారి, మానవుల మనస్సులలోనే దూరి కూర్చున్నాయి. పైకి మామూలు మనుష్యులు గానే కనిపించవచ్చు, కానీ మనస్సులో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే గుణాల రూపంలో మహిషాసురుడు, రక్తబీజుడు, బిడాలుడు, శుంభ, నిశుంభులు ఇత్యాది రాక్షసులు తిష్ఠ వేసుకుని కూర్చున్నారు. మరి వాళ్ళని సంహరించి మనకి శాంతిని, సుఖాన్ని ప్రసాదించడానికి ఆ జగన్మాత మహా గురు సరస్వతీ రూపంలో తన దివ్య వాక్కులనే శరీరాలతో మనలోని అసురులని సంహరించ డానికి వస్తోంది. కనుక మనమందరం మన హృదయాలను ఖాళీ చేసుకుని, ఆ జగన్మాత దివ్యబోధామృతంతో నింపుకుందాం. జగన్మాత దివ్య నామ సంకీర్తన, నామ స్మరణ ద్వారా వాక్శుద్ధిని, కాయశుద్ధిని, అమ్మతత్వ విచారణ ద్వారా మనశ్శుద్ధిని సాధిద్దాం. ఆ గురు జగన్మాత మనందరికీ అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ప్రసాదించి సర్వదా రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# అగస్త్య హృదయం

గత సంచిక తరువాయి

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**ఆదిత్యస్సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్।**

**సువర్ణ సదృశో భానుః హిరణ్యరేతా దివాకరః॥**

తాత్పర్యము -

ఆదిత్యుడు జగత్తు యొక్క సృష్టికర్తయై, సమస్త ప్రాణికోటికీ ప్రేరణ కలిగిస్తూ, కిరణ సమూహములతో సంచరిస్తున్నవాడై, వెలుగును, వర్షాన్నీ కలిగిస్తాడు. బంగారు వర్ణంలో ఉదయిస్తూ, హిరణ్యరేతస్సు కలిగి సకల జీవరాశికీ ఆయనే ఆధారభూతుడవుతున్నాడు.

ఈ శ్లోకం ఉదయిస్తున్న సూర్యుని గురించి విశేషంగా ప్రస్తావిస్తూ సూర్యభగవానుని ప్రాణికోటిని సృష్టించి వాటికి ప్రేరణ కల్పించే స్థితి కారకుడైన పరమాత్మ స్వరూపంగా ప్రకటిస్తోంది.

**సవితా** అని చేసిన సంబోధనతో సూర్యోదయమునకు పూర్వం చేయవలసిన గాయత్రి ఉపాసనను అగస్త్యులు తెలియజేస్తున్నారు. **ఓం భూర్భువః సువః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్** - అంటూ బుద్ధిని ప్రచోదనం చేస్తున్న పరమాత్మ స్వరూపంగా గాయత్రీ మాతను ఈ మంత్రం వివరిస్తోంది. **యా దేవీ సర్వభూతేషు బుద్ధి రూపేణ సంస్థితా నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః** - అంటూ బుద్ధి రూపంలో వున్న పరాశక్తిని ఉపాసిస్తారు. అయితే సాధకుడికి మాత్రం గాయత్రీ మంత్రం లోని శక్తి కేవలం గురుమూర్తి ద్వారా మాత్రమే కలుగుతుంది. అందుకే వారు గురుదేవులనే సృష్టికర్తగా (**తత్ సవితుర్**), ప్రకాశ రూపంగా (**వరేణ్యం భర్గోదేవస్య**), ప్రచోదనం కలిగించే చిచ్ఛక్తిగానూ (**ధియో యోనః ప్రచోదయాత్**) దర్శించగలుగుతారు. మరి ఆ గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థమును బ్రాహ్మీ ముహూర్తములో ధ్యానించాలన్నది ఈ శ్లోకంలో దాగి వున్న నిగూఢార్థము.

ధ్యానయోగంలో గీతాచార్యుడు **సుఖమాత్యంతికం యత్తత్ బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్** అంటూ ఇంద్రియాతీతమైన బుద్ధి మాత్రమే అంతులేని బ్రహ్మానందమును పొందగలదని శలవిచ్చారు. అటువంటి సాధనవైపు బుద్ధిని ప్రేరేపించడం కేవలం గురుదేవులకు మాత్రమే సాధ్యం.

**సూర్యః ఖగః పూషా గభస్తిమాన్** అన్న ప్రస్తావనలో సూర్య శబ్దము **(సరతి గచ్ఛతి ఇతి సూర్యః)** వేగంగా ప్రయాణిస్తూ భూమండలమంతా వెలుగులతో నింపే ఆదిత్యుని సూచిస్తోంది. **ఖగః** అన్న విశేషణము కూడా వేగంగా కదులుతున్న సూర్యుని గమనాన్ని తెలుపుతుంది. లోతుగా పరిశీలిస్తే ఈ రెండు శబ్దములూ ఆర్తుడైన భక్తుని ఆదుకోవడానికి వేగంగా వచ్చే పరమాత్మను ప్రకటిస్తున్నాయి. గజేంద్రమోక్షంలో **సిరికిన్ జెప్పడు శంఖచక్రయుగమున్ చేదోయి సంధింపడు, ఏ పరివారంబును జీరడు, అభ్రగపతింబన్నింపడు...గజప్రాణావనోత్సాహియై** ................అని చెప్పబడినట్లుగా ఖగవాహనుడైన విష్ణువు లక్ష్మీదేవికి సైతం చెప్పకుండా, శంఖ చక్రాదులను ధరించకుండా, గరుత్మంతుడినైనా సన్నద్ధం చేయకుండా ఆగమేఘాలమీద వచ్చి రక్షించాడన్నది మనందరికీ తెలిసిన విషయమే.

ఈ ఘట్టాన్ని వివరిస్తూ శ్రీబాబు 'గజేంద్రుడు నారాయణుడిని వైకుంఠవాసా! క్షీరసాగర శయనా! .... అని పిలిచినంత వరకూ స్వామి పలుకలేదనీ, మమ హృదయ నివాసా! అని ఆర్తిగా తలచిన తక్షణమే రక్షించాడని శలవిచ్చారు. భగవంతుడిని హృదయంలోనే దర్శించాలని బోధిస్తూ ఆ భావన మనకు ఆరూఢమవ్వాలని 'నేను మీ హృదయబాబును' అని ప్రకటించారు. శ్రీబాబు పలుమార్లు ఎంతో మంది భక్తులను ఆపదలనుండి కాపాడటమూ, ఒక్కొక్కప్పుడు రెండు చోట్ల సైతం ఏకకాలంలో దర్శనమిచ్చి ఆదుకున్న సందర్భాలు మనకు విదితమే!

ఆదిత్యుడు సకల జీవరాశులకూ జీవనాధారమైన వెలుగులను (**గభస్తిమాన్**), వర్షమును (**పూషా**) వెదజల్లునట్లు, తాము భక్తవత్సలురై జ్ఞానరోచస్సులను కురిపిస్తూ, కృపారసంతో సంసారతాపములను హరిస్తున్న సద్గురుదేవులను మనం ప్రేమతో **సంసారతాప సంహర్త్రేనమః** అని కొలుచుకుంటున్నాము. మరి వారే పిపీలికాది బ్రహ్మ పర్యంతమూ ప్రాణికోటికి ఆధారమయి వుంటారు కదా! ఆ అంశమునే హిరణ్యరేతా అని పేర్కొంటూ జగత్తుకి మూల బీజము గురువేనని సాధకుడు ఆ విషయం గ్రహించి అణువణువులో గురుదేవులను దర్శించాలని అగస్త్యులవారు పై శ్లోకం ద్వారా వివరిస్తున్నారు.

- సశేషం

# సుందరకాండ ఎందుకు చదవాలి?

( సేకరణ)

సుందరకాండ పారాయణ చేస్తే ఆగిపోయిన పనులు కూడా అయిపోతాయని లోకంలో ప్రతీతి. అలా చెప్పడంలో పెద్దల ఉద్దేశం కేవలం పారాయణ చేసినంతలో ఏదో 'హనుమచ్ఛక్తి' క్రిందికి దిగి వచ్చి, మన పనులన్నీ చేసి పెట్టేస్తుందని కాదు. సుందరకాండ మొత్తం సావకాశంగా, సావధానంగా చదివితే, కార్య సాధనలో ఎదురయ్యే ఆటంకాలు ఎన్ని రకాలుగా వుంటాయో, వాటిని ఏ రకంగా తొలగించుకోవాలో అవగాహన చేసుకుంటారని పెద్దల ఉద్దేశం.

ఏ విషయాన్నైనా అవగాహన చేసుకుని, వాటిని మన జీవితానికి అన్వయం చేసుకుని ఆచరణలో పెడితే, కానిపని వుంటుందా? హనుమంతుడు సముద్రలంఘనం చేస్తుంటే మూడు రకాల ఆటంకాలేర్పడ్డాయి. మైనాక పర్వతం మర్యాద చేయడానికి అడ్డంగా వచ్చి నిలబడింది. అది **సాత్విక** ఆటంకం. తరువాత సురస అనే రాక్షసి ఆకాశమార్గానికి అడ్డుగా వచ్చి, ఏ ప్రాణీ కూడా తన నోట్లోకి ప్రవేశించకుండా ముందుకు వెళ్ళలేరని పంతం పట్టింది. ఇది **రాజస** ఆటంకం. ఆ తరువాత సింహిక అనే ఛాయాగ్రాహిణి మాటామంతీ లేకుండా క్రిందకు లాగేయడం మొదలు పెట్టింది. ఇది **తామస** ఆటంకం.

కార్యసాధకుడైన హనుమంతుడు మూడు ఆటంకాలనీ మూడు రకాలుగా ఎదుర్కొన్నాడు. మైనాకుడు మర్యాదలు చెయ్యడం కోసం అడ్డుపడ్డాడు కాబట్టి, అతనితో మర్యాదగా మాట్లాడి, తిరిగి వచ్చేటప్పుడు ఆగుతానని చెప్పి దాటి వెళ్ళిపోయాడు. అలా సాత్విక ఆటంకం ఎదుర్కొన్నాడు. సురస ఆంజనేయుడిని మ్రింగేద్దామని నోరు తెరిచింది. స్వామి దానితో పోటీపడి దానికి రెట్టింపు స్థాయిలో శరీరం పెంచాడు. కొంతసేపు అయ్యాక సమయం వృథా అవుతోందని గమనించి, అతి సూక్ష్మశరీరంతో ప్రవేశించి దాని నోటిలో నుండి బయటపడ్డాడు. రాజస ఆటంకం నుండి బయటపడే ఉపాయం అది. ఆ తరువాత సింహిక ఆంజనేయుడి నీడ పట్టుకుని బలవంతంగా కిందకి లాగేస్తుంటే అది తమోగుణ ప్రవత్తి అని గ్రహించి, తన బలమంతా ఉపయోగించి, దాన్ని

పైకిలాగి ఒక్క గుద్దుతో పైలోకాలకి పంపించివేశాడు. అంటే తమోగుణానికి దండనతో బదులు చెప్పాడన్నమాట.

అలా మనం కూడా ఏదైనా ఒక గొప్ప లక్ష్యాన్ని సాధించాలనుకున్నప్పుడు ఎదురయ్యే ఆటంకాలు ఏ రకమైనవో గమనించుకుని ఆ రకమైన ప్రవృత్తితోనే వాటిని ఎదుర్కోవాలి. కొన్నిటిని మర్యాదగానే ప్రక్కకు తొలగించాలి. మరి కొన్ని విషయాలలో కొంతసేపు పోటీపడినా, సూక్ష్మమైన ఉపాయాలను ఆలోచించి, ఆ పోటీ నుండి బయటపడి మన పని మనం చేసుకోవాలి. తీవ్రవాదం వంటి సమస్యలను అంతే తీవ్రంగా ఎదుర్కొని ఉక్కుపాదంతో అణచివేయాలి. అక్కడ మెతకదనం పనికిరాదు. ఒక్క వ్యక్తి జీవితానికైనా, మొత్తం వ్యవస్థలో మార్పులకైనా ఈ త్రిగుణాత్మక వ్యూహం బ్రహ్మాండంగా పనిచేస్తుంది.

ఈ రకంగా సుందరకాండలో ఘట్టాలని అవగాహన చేసుకుని, మన జీవితానికి అన్వయించుకుని ఆచరణలో పెడితే, కాని పని అంటూ వుంటుందా? అందుకోసం సుందరకాండ అందరూ చదవాలి. కపీశ్వరుని కార్యసాధకత్వాన్ని అవగాహన చేసుకుని అనుసరించాలి.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా అక్టోబర్, నవంబర్ 2021 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***అక్టోబర్ 2021 :*** AS 2106, 5300, 6867, 7375, 7380, 7381, 7391, 8393, 8397, 8429, 8433, 8436, 8462, 8463, 8468.
LM 4277, 4282.

***నవంబర్ 2021 :*** AS 4887, 6122, 6689, 6765, 6790, 7450, 7609, 8473, 8478, LM 4284, 4286, 4287, 4288, 4302.

# మాయ

సేకరణ - నేలభొట్ల ప్రసాద్

నాటకంలో మనం పాత్రధారులమై ఎంతో సీరియస్‌గా ఆ మట్టి ముద్దల పాత్రలను పోషిస్తున్నాం. ఇదే మాయ. ఇదే అజ్ఞానం. నేను వచ్చింది అక్కడి నుంచే. మరి ఎక్కడకు వెళ్ళాలి? ఆ పరమాత్మ వద్దకే. పరమాత్మ నుండి వచ్చిన జీవుడు కొంతకాలం ఈ జీవిత నాటక రంగంలో సుఖదుఃఖాలు అనుభవించి చివరకు ఆ పరమాత్మలో చేరిపోవాలి. అప్పుడే పరమ శాంతి, శాశ్వతానందం.

**కాతే కాంతః ?**

నీ భార్య ఎవరు? ఇప్పుడు నీ భార్య అనబడే స్త్రీ వివాహానికి ముందు ఒకరి కుమార్తె ఆమె పుట్టుకలోగాని, పెరగటంలోగాని, నీకు ఏ ప్రమేయమూ లేదు. ఆమె ఎక్కడో పుట్టింది. నీవు మరెక్కడో పుట్టావు. అయినా పెళ్ళితో మీరిద్దరకూ ముడి పెట్టడం జరిగింది. పోనీ, ఇప్పుడు ఇద్దరూ కలిసి ప్రయాణిస్తున్నారు కదా. చివరిదాకా ఇలా కలిసి ప్రయాణిస్తారా? అదేం లేదు. ఈ ప్రయాణంలో ఎవరో ఒకరు ముందు దిగిపోతారు. ఆ రెండవ వారు ఒంటరి ప్రయాణం సాగించాలి. అంటే జన్మించడం ఒక్కసారి జరగలేదు. వెళ్ళిపోవడం కూడా ఒక్కసారి జరగడం లేదు. ఈ మధ్యలో మాత్రమే కొంతకాలం విడిగాను, కొంతకాలం కలిసిమెలిసి జీవిస్తారు అంతే.

ఇదంతా రైలు ప్రయాణం లాంటిది. ఒక ప్రయాణీకుడు మద్రాసులో రైలెక్కాడు. రైలు కొంతదూరం ప్రయాణించాక నెల్లూరు రాగానే మరొక ప్రయాణీకుడు ఆ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కాడు. ఇద్దరూ ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. లోకాభిరామాయణంతో ప్రారంభమై, రాజకీయాలు, సినిమాలు, వేదాంతం అన్నీ మాట్లాడుకున్నారు. ఎంతో ఆత్మీయులయ్యారు. మొదటి ప్రయాణీకుడు చీరాల రాగానే దిగిపోయాడు. రెండవ ప్రయాణీకుడు మొదటివాణ్ణి విడిచి ఒంటరిగా, దీనంగా ప్రయాణించి విజయవాడలో దిగిపోయాడు. ఇంతే వారిద్దరి మధ్య సంబంధం.

భార్యాభర్తల మధ్య సంబంధం కూడా ఇలాంటిదే. అందుకే తత్త్వ విచారణ చేసి ఈ సంబంధం ఎట్టిదో సరియైన అవగాహన

చేసుకోవాలి. అప్పుడే నీవు ఎలా ప్రవర్తించాలో సరిగ్గా తెలుస్తుంది.

**కస్తి పుత్రః ?**

అలాగే నీ కుమారుడెవరు? అని కూడా విచారించు. పుట్టిన దగ్గర నుండి అతను నీకెంతో ప్రేమాస్పదుడైన కుమారుడు. మరి అంతకు ముందు? అతడు నీ గర్భంలో పిండం. అంతకు ముందో? అతడు నీలో బీజరూపం. ఆ బీజం ఎలా వచ్చింది? నీవు తిన్న ఆహారం ద్వారా నీలో తయారైంది. మరి ఆ ఆహారం ఎక్కడి నుంచి వచ్చింది? భూమిలో నుండి వచ్చింది. అంటే మట్టి అనేక మార్పులు చెంది, ఆహారంగా మారి, ఆ ఆహారం నీలో బీజంగా మారి, ఆ బీజం నీ భార్య గర్భంలో ప్రవేశించి పిండంగా మారి, అది వృద్ధి చెంది శిశువుగా వ్యక్తమైంది.

అంటే మట్టి యొక్క చివరి రూపమే నీ కుమారుడు అన్నమాట. మరి నీవు ఎవరు? నీవూ అంతే. కాకపోతే ఆ బిడ్డ కన్నా కాలంలో నీవు ముందున్నావు. నీవు కూడా ఆ మట్టి యొక్క ఆఖరి రూపమే.

ఈ లెక్కన చూస్తే కదులుతున్న ఒక పెద్ద మట్టి ముద్ద మరొక చిన్న మట్టి ముద్దను దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంటుంది, ప్రేమను పెంచుకుంటుంది. విడిచిపెట్టాల్సి వచ్చినప్పుడు విలవిలలాడిపోతుంది. దూరంగా వుండి ఈ రెండు మట్టి ముద్దల నాటకాన్ని మనం తమాషాగా చూస్తున్నాం అనుకోండి, నవ్వకుండా వుండలేం. వున్నది వున్నట్లుగా చూడలేక 'నాది-నాది' అని భ్రమలోపడి కొట్టుకుపోతుంటాం. ఎంత చిత్రం! అందుకే ఈ సంసారం అతి విచిత్రం. తమాషా అయినట్టిది. ఇంతకీ ఈ సంసార బంధంలో చిక్కుకుపోయిన నీవు ఎవరు? ఎవరి వాడవు? ఎక్కడి నుండి వచ్చావు? ఈ విచారణ ముఖ్యమైనది. వేదాంతంలో 'నేనెవరిని?' అని విచారణ చేయడమే మానవ జీవిత సార్థక్యానికి ఏకైక ఉపాయం.

సమస్త దుఃఖాలకు అజ్ఞానానికి అంతమే ఈ 'నేనెవరు?' అనే విచారణయేనని భగవాన్ రమణ మహర్షి వారిచ్చిన సందేశం.

నేనెవరు? నేను ఈ శరీరమా? కాదు. ఇదొక గృహం లాంటిది. జడమైనది. ఇందులో కూర్చుని నేను నా పనులను నిర్వర్తించు కుంటున్నాను. మరి నేను మనోబుద్ధులనా? కాదు. అవి నేను పనిచేయడానికి వుపయోగించుకునే పనిముట్లు మాత్రమే. అవీ జడమే.

వాటిని నేను వుపయోగించుకుంటున్నాను. మరైతే నేను ఎవరు? దేహంలో కూర్చుని, మనోబుద్ధులను ఉపయోగించుకుని పనిచేసే జీవుడను. అయితే జీవుడనైన నేను ఎవరికి చెందిన వాడను? ఎక్కడి నుంచి వచ్చాను? నేను నిజంగా అంతటా వ్యాపించి వున్న పరమాత్మకు చెందిన వాడను.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**అక్టోబర్ 2021-**

1 శుక్ర - శ్రీగురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

7 గురు - శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం. భక్తసమారాధన

12 మంగళ - మూలా నక్షత్రం సరస్వతీ పూజ.

13 బుధ - దుర్గాష్టమి - కుంకుమ పూజ.

14 గురు - మహర్నవమి - కుంకుమ పూజ, భక్త సమారాధన.

15 శుక్ర - విజయదశమి - కుంకుమ పూజ.

20 బుధ - ఆశ్వయుజ పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ.

30 శని - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

**నవంబర్ 2021-**

3 బుధ - నరక చతుర్దశి

4 గురు - దీపావళి - శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన

19 శుక్ర - (కార్తీక) గురు పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

29 సోమ - శ్రీ గురుదశమి - శ్రీసద్గురుపాదపూజ

# అదృశ్య శక్తి అన్నీ గమనిస్తూనే వుంటుంది!

సేకరణ - వి. సాయికృష్ణ

చుట్టూ ఎవరూ లేనప్పుడు తప్పుడు పనులకు తెగించడం మానవ బలహీనత! కానీ, .... 'నేను ఒక్కడినే వున్నాను, నన్ను ఎవరూ గమనించడం లేదు' అని మనిషి అనుకోవడం చాలా పొరపాటు. మనిషి ఏ పని చేస్తున్నా నిశితంగా గమనించేవి మూగసాక్షులు 18 వున్నాయి.

అవి నాలుగు వేదాలు, పంచభూతాలు, అంతరాత్మ, ధర్మం, యముడు, ఉభయ సంధ్యలు, సూర్య చంద్రులు, రాత్రింబవళ్ళు. వీటినే అష్టాదశ మహా పదార్థాలు అంటారు. ఈ మూగ సాక్షులు అనుక్షణం మానవుణ్ణి నీడలా పర్యవేక్షిస్తుంటాయి.

ఇవి మన లోకంలోని న్యాయస్థానాలలో సాక్ష్యం చెప్పక పోవచ్చుగానీ, వీటి గమనిక నుండి మనిషి తప్పించుకోవడం సాధ్యం కాదు. దీన్ని గుర్తించలేని కారణంగానే, ఇవన్నీ జడపదార్థాలేననీ, సాక్ష్యం చెప్పడానికి నోరు లేనివని, మానవుడు భ్రమపడుతూ వుంటాడు. ఈ మహాపదార్థాలు రహస్య యంత్రాల వంటివి. అవి మనిషి ప్రతి చర్యనూ నమోదు చేస్తూ వుంటాయి. ఆ నివేదికలను విధికి చేరవేస్తూ వుంటాయి. అది వాటిని కర్మలుగా మలుస్తుంది. మానవుడు చేసేవి మంచి పని అయితే సత్కర్మలుగా, చెడ్డ పనులు అయితే దుష్కర్మలుగా విధి నిర్ణయిస్తుంది. సత్కర్మలకు సత్కారాలు, దుష్కర్మలకు జరిమానాలు అమలవుతాయి. అవి ఏవో మరుజన్మకో లేక ఆ తరువాతో ఫలిస్తాయని అనుకోకూడదు. ఈ జన్మలోనే అమలు చేయవచ్చు! ఇది నిరంతరాయంగా సాగిపోయే సృష్టి పరిణామ క్రమం.

అంతరాత్మ అనేది ఒకటున్నదని ప్రతి వ్యక్తికీ తెలుసు. అది మనం చేసేపని మంచిదా? చెడ్డదా? అనే విషయాన్ని ఎప్పటికప్పుడే చెప్పేస్తుంది. కానీ, ఆవేశం, కోపంతో విచక్షణ కోల్పోయిన వ్యక్తి అంతరాత్మ సలహాను కాలరాస్తాడు. అది అనర్థాలకు దారితీయడం మనందరికీ అనుభవమే. ఒక్కొక్కసారి అంతరాత్మ నిలదీస్తున్నప్పుడు పశ్చాత్తాపంతో సిగ్గుతో తలదించుకుంటాం. కానీ, దీన్ని మనమెవరితోనూ పంచుకోము. అందువలన అంతరాత్మ అనుభవపూర్వకంగా నిజమైనప్పుడు మిగతా 17కూడా నిజమేనని గ్రహించగలగడమే వివేకము.

**(తరువాయి భాగము 20వ పేజీలో ...............................)**

# ఛాందోగ్యోపనిషత్ సారం

- సుషుమ్నా ప్రసాద

(గత సంచిక తరువాయి)

కాబట్టి మానవుడికి అన్ని దశలలో నిలిచి వుండే పదార్థం ఆత్మ ఒక్కటే. 'నేను' అనే స్ఫూర్తి ఆత్మ. ఆ స్ఫూర్తి మనకు ఎప్పుడూ వుంటుంది. నిజమైన **త్వం** పదార్థం ఆత్మ మాత్రమే. ఇది అహంకారమునకంటే విలక్షణమైన శుద్ధ చైతన్యం. దీనికి లక్ష్యార్థమని పేరు. మిగతా శరీరాదులన్నీ **త్వం** పదమునకు వాచ్యార్థములు అంటారు. వాచ్యార్థములలో ఒక్కొక్క దానిని ఇది కాదు, ఇది కాదని త్రోసివేస్తే (నేతి నేతి వాక్యాలు - అంటే నా ఇతి నా ఇతి - ఇదికాదని అర్థం) దానినే ఇంగ్లీషులో ఎలిమినేషన్ ప్రాసెస్ అంటారు. అలా త్రోసివేస్తూపోతే చివరకు అనుభవానికి వచ్చేదే లక్ష్యార్థం. లక్ష్యార్థమే మన శరీరంలో వున్నదసలు. 'అనేన జీవాత్మనేనా అను ప్రవిశ్య' అంటే అఖండమైన ఈశ్వర చైతన్యమే జీవాత్మరూపంగా మన శరీరంలో ప్రవేశించిందని చెబుతున్నదని ఉపనిషత్తు. అయితే శరీరాది ఉపాధుల మధ్య చేరి, వాటికి భిన్నంగా మనకు భావించడం లేదు. కానీ రాక్షసుల మధ్య వున్నా విభీషణుడు రాక్షస స్వభావుడు కానట్లే వుపాధుల మధ్య వున్నా అది ఉపాధి స్వరూపం కాదు. శుద్ధమైన చైతన్యమే. అపరిచ్ఛిన్నమైతే అది **త్వం** పదార్థం కాదు. పరిచ్ఛిన్నమైనది **త్వం** పదార్థం. అపరిచ్ఛిన్నమైనది **తత్** పదార్థం. అపరిచ్ఛిన్నమైన జ్ఞానాన్ని తత్ పదార్థం అంటారు. త్వం, తత్ రెండూ అపరిచ్ఛిన్నమైతే రెండో దానికి తావు లేదు. రెండూ కలిసి (తత్ - అది, త్వం - నీవు) ఒకటి కావడమే తత్త్వమసి కర్థము. దీనితో జీవుడికి తాను ఈశ్వరుడే అని అఖండానుభవం సిద్ధిస్తుంది.

అయితే శరీరాదులైన ఉపాధులూ, ప్రపంచమనే పెద్ద ఉపాధి. ఈ రెండూ సుందోపసుందులమాదిరి వున్నాయి కదా. అప్పుడు మనకు కలిగే అనుభూతి అఖండమెలా అవుతుందని ప్రశ్న వస్తుంది. దీనికి సమాధాన మేమంటే జీవుడెప్పుడు ఈశ్వర స్థాయినందుకున్నాడో అప్పుడు శరీరాది ఉపాధులు వుండటానికి లేదు. అవి కేవలం కల్పితమే. ఎందువల్లనంటే **సదేవసోమ్యేదమగ్ర అసీదేకమేవా అద్వితీయమ్** అని ఉపనిషద్ వాక్యము. బ్రహ్మమనేది ఏకమే కాదు అద్వితీయం కూడా. అద్వితీయమన్నప్పుడు ప్రపంచం (అంటే రెండవది) లేదనే కదా అర్థము. అయితే కనబడుచున్నది కదా అని సందేహం రావచ్చు. కనబడినా అది అసత్యమే అంటున్నది ఉపనిషత్తు. **వాచారంభణం వికారోనామధేయం మృత్తికేత్యేవ సత్యమ్** - అంటే మృత్తికతో (మట్టి) ఘటాదులు మున్నగు ఎన్నో భిన్నమగు

వస్తువులను సృష్టిస్తాము. వాటికి మూలము మృత్తిక అంటే కనబడేవన్నీ అసత్యవే. విచ్ఛిన్నమవుతాయి. మృత్తిక ఒక్కటే సత్యం. అలాగే పంచభూతాత్మకమైన బాహ్య ప్రపంచము అహంకారాదికమైన అంతః ప్రపంచము ఈ రెండు ఉపాధులు అఖండ చైతన్యము యొక్క వికారములే. వికారాదులు కనుక ఇది అసత్యమే. ఆత్మ చైతన్యమొక్కటే సత్యమైనది కాబట్టి త్వం పదార్థమైన జీవునకు తత్ పదార్థ జ్ఞానం అనుభవానికి వస్తే చాలు. ఇంక ప్రపంచం లేదు. శరీరాదులు లేవు. అవి రెండు బాధితమైపోతాయి.

దీనికి బాధసామానాధికరణ్యమని పేరు. సామానాధికరణ్యమంటే రెండిటికీ ఒక్కటే ఆధారం కావడం. ఈ ఉపనిషత్తులో **ఐకదాత్మ్యమిదమే సర్వం తత్సత్యమ్ స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో** అన్నప్పుడు ఉపనిషత్తు చెప్పిన **ఐకదాత్మ్యమిదం సర్వం స ఆత్మా** అని రెండూ బాధసామానాధికరణ్యాలు. అంటే ఈ జగత్తు అది. ఈ జీవుడు కూడా అది. భిన్నమైనవి కావు. రజ్జుసర్ప భ్రాంతిలో సర్పం కూడా రజ్జువే అన్నట్లు వుంటుంది. సర్పం రజ్జువే అన్నప్పుడు సర్పం బాధితమై రజ్జువు శేషించినట్లే జగత్తు అది, జీవుడు అది అన్నప్పుడు అది కూడా బాధితమై రెండింటికీ బదులు కేవల చైతన్యమే శేషిస్తుందని భావించాలి.

అసలు స్వరూపమేమంటే రజ్జువులో సర్పమనేది ఎప్పుడూ కల్పితమే. ఉన్నది ఒక్క రజ్జువే. అలాగే త్రికాలములలో వున్నది బ్రహ్మమే. జీవుడు లేడు. జగత్తు లేదు. అవి కేవలం భ్రమే. మన భ్రాంతి వలన అవి వున్నట్లు కనిపిస్తున్నాయి. కాబట్టి వాటిని మీరలా బాధితం చేసుకోవలసి వస్తుంది. అందుకే వేదాంతులు **ప్రాప్తస్య ప్రాప్తిః పరిహృత స్వపరిహారః** అన్నారు. అంటే పొందిందే పొందుతున్నారు, వదిలిందే వదులుతున్నారు అని అర్థం. పొందినదే పొందడం బ్రహ్మమైతే, వదిలిందే వదలడం ప్రపంచం. బ్రహ్మతత్వమనేది కొత్తగా వచ్చేది కాదు. నీవు మెడలో వేసుకున్న రవ్వల నెక్లెస్‌ను నువ్వు మరచిపోయి మరల వేసుకోవడానికి ప్రయత్నించడమే, బ్రహ్మతత్వమును పొందడం. ప్రపంచాన్ని వదలుకోవడమెలాటిదంటే, కాలికి తగులుకున్న బంతిపూల దండని భ్రమించి దానిని వదలుకోవడానికి ప్రయత్నించడమే. కావున జీవునకు తత్పదార్థమైన బ్రహ్మానుభవము కలిగిందంటే ఇక ఉపాధి ప్రపంచమనేది లేదు. అది కూడా బ్రహ్మాకారముగానే పరిణమిస్తుంది. ఇలా తత్త్వమసి వాక్యోపదేశం ద్వారా ఆత్మైకతత్వమును ప్రసాదించడమే ఛాందోగ్యోపనిషత్తు యొక్క లక్ష్యము.

- సశేషం

# మీకో బహుమతి!

సేకరణ - బొంబాయి కృష్ణా రావు

మీరొక బహుమతి గెలుచుకున్నారు అనుకోండి! దాని ప్రకారం మీకు మీ బాంక్‌వారు మీ అకౌంట్‌లో 86,400 వేస్తారు. కానీ, కొన్ని షరతులకు లోబడి ఈ బహుమతి వుంటుంది. ఆ షరతులు ఏమిటంటే....

1. మీరు ఆ రోజు ఖర్చు పెట్టలేనిదంతా మీ ఖాతా నుండి తీసివేస్తారు.
2. మీరు మరొకరి అకౌంట్‌కు డబ్బు బదలాయించ రాదు.
3. మీరు ఖర్చు పెట్టుకోవచ్చు.
4. మీరు ఉదయం లేవగానే మీ అకౌంట్ 86,400 లతో మొదలవుతుంది. ఆ రోజు వరకే అది.
5. ఏ రోజు అయినా, మీ బాంక్ 'బహుమతి ఆట అయిపోయింది. మీ ఖాతా ముగిస్తున్నాము. మీకు మరొక ఖాతా మేము తెరువలేము' అనవచ్చు.

అలాంటి పరిస్థితుల్లో మీరు ఏమి చేస్తారు? అన్నదే ప్రశ్న. మీరు మీకు కావలసినవి అన్నీ కొనుక్కుంటారు అవునా? మీ కోసమే కాదు, మీరు ప్రేమించే వారి కోసం, అంతేకాదు మీకు తెలియని వారికోసం కూడా. ఎందుకంటే ఆ రోజు వచ్చి పడిన సొమ్మంతా మీరు మీ కోసమే ఖర్చు చేయలేరు. ఎందుకంటే ఉదయం కాగానే నిన్నటి బాలన్స్ డబ్బు మీ ఖాతాలో వుండదు కదా! అందుకే ఈ రోజే అంతా ఖర్చు చేయాలనుకుంటారు. అవునా? ప్రతి రూపాయీ ఖర్చు చేయాలని చూస్తారు. ఔనా? కాదా?

నిజానికి ఇది బహుమతి ఆట కాదు. వాస్తవం. ఆశ్చర్యపోకండి! నిజం! ఇది వాస్తవం!!

మనలో ప్రతి ఒక్కరమూ ఈ బహుమతి గెలుచుకునే వున్నాం. కానీ అది మనం చూడటం లేదు. ఏమిటా బహుమతి అంటారా? 'సమయం'. సమయం!!

ప్రతిరోజూ లేవగానే మనకు 86,400 సెకన్లు మన జీవితంలోకి బహుమానంగా వస్తున్నాయి. మనం రాత్రి నిద్రపోయినప్పుడు, మిగిలి పోయిన 'సమయం' మన ఖాతాలో వుండదు. మనం ఏ సమయం

అయితే పోగొట్టుకున్నామో, అది మళ్ళీ మన జీవితంలోకి తిరిగి రాదు కదా! 'నిన్న' అనేది శాశ్వతంగా పోయింది.

ప్రతిరోజూ ఉదయం మీ ఖాతా మళ్ళీ 86,400 సెకన్లతో నింపబడుతుంది. కానీ ఆ భగవంతుడే మళ్ళీ మీ బాంక్ ఖాతాని మీకు చెప్పాపెట్టకుండా ఎప్పుడైనా ముగించేయవచ్చు అవునా!

కాబట్టి ఓరి పిచ్చితండ్రీ/ తల్లీ, మీరు మీకు రోజూ వచ్చే 86,400 సెకన్లతో ఏం చేస్తారు అన్నది ముఖ్యం. ఈ సెకన్లు ఎంతో విలువైనవి కదా! ఇవి రూపాయలతో సమానం. కాబట్టి జాగ్రత్తగా ఆలోచించి, సమయాన్ని సరిగ్గా ఖర్చు పెట్టాలి కదా!

ప్రతి సెకను మీరు ప్రేమతో నింపి భగవంతుని ఆరాధనతో, పరవశించి పోయారనుకోండి, ఆ సమయం ఎంత వేగంగా పరుగెత్తినా మీరు ఏమీ పోగొట్టుకోరు. ఎందుకంటే మీ చుట్టూ, భగవంతుని ఆరాధిస్తూ మీ సమయంతో ఒక కోట నిర్మించుకున్నారన్నమాట. ఆ కోటలోకి కోపం, దుఃఖం, ద్వేషం, అసూయ, పగ అనేవేవీ దండయాత్ర చేయలేవు.

కాబట్టి మీ సమయం భగవంతుని ఆరాధనలో కొంచెమైనా ఖర్చు చేయండి. మీకు శుభం కలుగుతుంది. జై శ్రీమన్నారాయణ!

**16వ పేజీ నుండి 'అదృశ్యశక్తి.....' తరువాయి భాగం................**

నలుగురికీ తెలిసేలా దానధర్మాలు, క్రతువులు, పూజలు నిర్వహించాలన్న కుతూహలం అవివేకం. అష్టాదశ సాక్షులు ఎల్లవేళలా గమనిస్తున్నాయంటే, ఎవరు చూడాలో వాళ్ళు చూస్తున్నారనే అర్థం. ఈ ఎరుక కలిగినప్పుడు మనిషి చెడ్డపని చేయడానికి తెగించడు. ఎవరు చూసినా, చూడకపోయినా మంచితనంతో, తోటివారికి సాధ్యమైనంతవరకూ సహాయం చేయాలనే సత్సంకల్పంతో జీవితాన్ని గడపడం ఉత్తమం. ఈ జ్ఞానం వలన మనిషి సాధ్యమైనన్ని మంచిపనులు చేయడానికి ప్రయత్నిస్తూ సుఖశాంతులకు నోచుకుంటాడు.


లోపం
మధుప
ఏరా! ఇవాళ మీ స్కూల్లో పెన్సిల్ దొంగతనం చేశావుట? ఇవాళ నీకు భోజనం లేదు.
1
ఏమండీ! అంత చిన్న తప్పుకి వాడికి అంత పెద్ద శిక్ష వేశారు ఎందుకండీ?
2


ఒకసారి మా ఇంజనీరింగ్ డిపార్ట్మెంటులో ఏమైందో తెలుసా?
3


సార్! అక్కడ చూడండి. చిన్నగా బీటలు పడ్డాయి.
4


చిన్న వేగా, తరువాత చూద్దాంలే!
5


కొన్ని రోజుల తరువాత
6


వెంట్రుకవాసి చీటే
కదా అని నిర్లక్ష్యం
చేస్తే అది మొత్తం
డ్యామునే నాశనం
చేసింది చూశావా?
7
అలాగే ఈరోజు చిన్న లోపమే
కదా అని వదిలేస్తే రేపు వాడి
జీవితమే నాశనం
అయిపోతుంది. మన లోపం
ఎంత చిన్నదైనా వెంటనే
సరిదిద్దుకొంటేనే మన జీవితం
సవ్యంగా సాగుతుంది.
8

# బాబూజీతో అనుభవాలు

- వి. లక్ష్మీ నరసమాంబ

(గత సంచిక తరువాయి)

2018 సెప్టెంబర్‌లో సత్సంగ సమావేశములు

2018 సెప్టెంబర్ 17వ తారీఖు నుండి 23 వరకు హైదరాబాద్ శాఖలో సత్సంగ సమావేశాలు జరిగాయి. వాటికి మొదటి రెండు రోజులూ ఉదయం పూట హాజరు కాగలిగాను కానీ అనారోగ్య కారణాల వలన ఆ తరువాత రోజులలో ఆశ్రమానికి రాలేకపోయాను. సుగరు వల్ల విపరీతమైన నీరసం, ఎప్పుడూ పడుకునే వుండటం జరిగింది. ఆ పరిస్థితులలో వరుసగా మూడు రోజులు పోలేకపోయాను. 'అయ్యో! ఆశ్రమంలో చివరకు సామూహిక పూజకు డబ్బు కూడా కట్టలేకపోయానే!' అని బాధపడ్డాను. చివరకు 22వ తారీఖున తలస్నానం చేసి, చెక్‌బుక్ బ్యాగ్‌లో వేసుకుని, డ్రైవర్ రాకపోతే, టాక్సీ పిలిపించుకుని, ఓపిక లేకపోయినా సరే, పూజకు డబ్బు కట్టడానికి బయలుదేరి వెళ్ళాను. ఉదయం 11గంటలు అయింది నేను అక్కడకు చేరేసరికి. నేను వెళ్ళేసరికి, అక్కడ రేపటి పూజ ఆరోజు ముందుకు జరిపినట్లు, మరికాసేపట్లో పూజ ప్రారంభం కాబోతున్నట్లు, మాతాజీగారు రావడానికి సిద్ధంగా వున్నట్లు, అందరూ హాజరుగా పూజకు కూర్చున్నట్లు తెలిసింది. ముందుగా నేను డబ్బు కూడా కట్టలేదుగా! ఎవరైనా డబ్బు కట్టించుకునే వాళ్ళు కనబడితే, వారి చేతికి డొనేషన్ క్రింద చెక్కు ఇచ్చేసి, కూర్చునే ఓపిక కూడా లేదు ఇక ఇంటికి వెళ్ళిపోదాము అనే ఉద్దేశంతో పైకి వెళ్ళాను. వెళ్ళి బాబూజీ ఎదురుగా వున్న ప్రవేశ ద్వారం వద్ద వున్న కుర్చీలో కూర్చున్నాను. అయితే, నా ఎదురుగుండా వున్న ఒక పొడుగు బల్ల మీద పూజా పళ్ళాలు పెట్టబడి వున్నాయి. అందరూ వచ్చి కూర్చున్నారు (డబ్బు కట్టిన వారందరూ) కానీ, నా ముందు ఒక కుర్చీ, దాని ఎదురుగా ఒక పూజా పళ్ళెం ఖాళీగానే వున్నాయి.

నేను కూడా పూజకు కూర్చోవచ్చు కదా! - అన్న ఆలోచన నాలో తొలిచేయడం మొదలు పెట్టింది. అలా అలోచన కలిగిన కొద్ది క్షణాలలోనే - పూజ అనంతరం డబ్బు కట్టవచ్చునని నిర్ణయం చేసుకుని, వెళ్ళి ఆ కుర్చీలో కూర్చున్నాను. ఎవరో వచ్చి కొబ్బరి నీళ్ళు, మంచి నీళ్ళు వున్న

గ్లాసులు, పువ్వులు కూడా నా దగ్గర పెట్టి వెళ్ళారు.

బాబూజీగారి దగ్గర కూర్చుని మాతాజీగారు పూజ చేసుకునే వారి గోత్రనామాలు చదువుతున్నారు. అయ్యో! నా గోత్రనామాలు అందులో లేవు కదా! ఎవరైనా నా పేరు అక్కడ చేరుస్తారా? అనుకుంటూ అలాగే కూర్చున్నాను. ఇంతలో తడి చేతులు తుడుచుకునేందుకు రెండు టిష్యూపేపర్లు వాలంటీర్ తెచ్చి ఇచ్చారు. నేను వెంటనే ఒక పేపర్‌మీద నా గోత్రనామాలు వ్రాసి, ఆ వాలంటీర్ చేతికిచ్చి పంపించాను. వారు ఆ కాగితం పట్టుకు వెళ్ళి అమ్మ ప్రక్కనే నిలబడి వున్న మనోహర్ గారి చేతికిచ్చారు. వారు అమ్మ అన్ని పేర్లు చదవడం అయిన తరువాత ఆ కాగితాన్ని (టిష్యూపేపర్‌ని) అమ్మ చేతికి అందించడమూ, వారు నా పేరు కూడా చదవటమూ అయిపోయింది. ఆ తరువాత పూజ అంతా నిర్విఘ్నంగా జరిగింది. పూజ పూర్తి అయింది. మహా ప్రసాదం తీసుకుని, ఆఫీసులో పూజా రుసుము చెల్లించి, ఇంటికి తిరిగి వచ్చాను.

ఇంట్లో కూర్చునే ఓపిక లేక పడుకునే వున్న నేను, ఎలా 5గంటలసేపు కూర్చుని నిర్విఘ్నంగా కార్యక్రమాన్ని ముగించుకుని వచ్చాను! అన్నది బాబూజీ దయ వలనే కదా!

అలా ఎన్నో సందర్భాలలో మన మనస్సులో అనుకున్న దానిని ఆయన గమనించి నెరవేరుస్తూ వుంటారు.

- సశేషం




### చందాదారులకు విజ్ఞప్తి

సమర్థసద్గురు మాస పత్రికకు చందా కట్టుటకు ప్రక్కనవున్న క్యూఆర్ కోడ్(**QR code**)ను స్కాన్ చేసి ఆ వివరములను ఈ క్రింది నంబరుకు వాట్సప్ మెసేజి పెట్టవలెను. చందా వివరములు

రూ.60/- సంవత్సరమునకు;

రూ.250/- 5 సంవత్సరములకు;

రూ.1116/- 20 సంవత్సరములకు.

తెలియజేయవలసిన ఫోన్ నం. 8333808310

మేనేజర్

# లక్ష్మి

- పాలూరి కాళీ ప్రసాద్

లక్ష్మి అంటే ఐశ్వర్యం, లక్ష్మి అంటే సంపద, లక్ష్మి అంటే సుఖసంతోషాలు, లక్ష్మి అంటే ఆనంద కోలాహలం. క్షీరసాగర మథనంలో అవతరించి, క్షీరసాగర శాయిని వరించి, తనను నమ్ముకొన్న భక్తులను పాడిపంటలలో, సుఖసంతోషాలలో ఓలలాడించే చల్లని తల్లి లక్ష్మీదేవి. తన సోదరుడయిన చంద్రుడు ఎలాగయితే సూర్యకాంతిని ప్రతిబింబిస్తూ లోకానికి చల్లని వెన్నెలను ప్రసాదిస్తాడో, అలాగే ఈ తల్లి శ్రీమన్నారాయణుని వైభవాన్ని ప్రతిబింబిస్తూ లోకానికి పోషణను అందిస్తుంది.

అయితే ఈ లక్ష్మి లేదా ఐశ్వర్యం నీడలాంటిది. మనం వెలుగువైపుకు ప్రయాణిస్తుంటే నీడ మన వెంటబడి వస్తుంది. అదే మనం వెనక్కి తిరిగి నీడ వెంటబడితే అది మనకన్నా ఎప్పుడూ ముందే వుంటుంది కానీ మనకు ఎప్పటికీ అందదు. అలాగే లోకానికంతటికీ ప్రకాశాన్నిచ్చే నారాయణుని వైపుకు మనం ప్రయాణిస్తుంటే, ఐశ్వర్యం మన వెంటే వుంటుంది. అదే మనం నారాయణుని వదిలిపెట్టి, ఐశ్వర్యం వెంట పరుగులు తీస్తే అది ఎన్నటికీ దక్కదు. దక్కినా కలకాలం నిలవదు. లక్ష్మీదేవి నామాలలో **ఓం చంచలాయై నమః, ఓం చపలాయై నమః** అనే నామాలు కూడా వున్నాయి. అంటే ఆవిడ ఏ ఒకరి దగ్గరా స్థిరంగా వుండదు.

కానీ ఆవిడ స్థిర నివాసం చేసే స్థానం ఒకటి వున్నది. అదే శ్రీమన్నారాయణుని హృదయ మందిరం. **ఓం విష్ణువక్షస్థల స్థితాయై నమః.** మన మనస్సులోని చాపల్యాన్ని, చంచలత్వాన్ని వీడి ఎప్పుడయితే ఆ నారాయణుని మన హృదయ మందిరంలో స్థిరంగా ప్రతిష్ఠించుకుంటామో, అప్పుడు ఆయన హృదయస్థితయైన లక్ష్మీ కటాక్షం మనకు సుస్థిరమవుతుంది.'లక్ష్మీనారాయణుని చరణాలను నీవు ఆశ్రయిస్తే, లక్ష్మీదేవి కూడా ఎప్పుడూ అక్కడే వుంటుంది. ఆ తల్లి నీకు ఇహలోకంలో ఏ లోటూ రాకుండా చూసుకుంటుంది. ఆయన నీకు పరమపదాన్ని ప్రసాదిస్తాడు' అని శ్రీగురుదేవులు తరచుగా చెప్పేవారు.

అయితే ఇలా మనకు లభించిన సంపదను సరిగ్గా వినియోగించ గలగటం కూడా ఒక వరమే. **దానం భోగో నాశః తిస్రో గతయో**

**భవన్తి విత్తస్య। యో న దదాతి న భుఙ్క్తే తస్య తృతీయా గతిర్భవతి॥** విత్తానికి మూడు గతులని భర్తృహరి చెబుతాడు. అవి దానం, భోగం, నాశం. ఇందులో ఉత్తమగతి మనకున్న సంపదను వీలైనంత దానం చేయడం. ఇక మధ్యమగతి కనీసం నీవైనా అనుభవించడం. ఇక ఈ రెండూ చేయని పిసినారి వాని సంపదకు మూడవగతియే శరణ్యమని చెబుతాడు. అంటే ఎవరైతే తమ సంపదని దానం చేయకుండా, తాము అనుభవించకుండా దాచిపెడతాడో ఆ సంపద చివరికి అగ్ని వలనో, చోరుల వలనో, రాజుల వలనో, ఇన్‌కమ్ టాక్స్ వారి వలనో నాశనం అయిపోతుంది.

ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, విజయలక్ష్మి, వీర్యలక్ష్మి, గజలక్ష్మి విద్యాలక్ష్మి, సంతానలక్ష్మి - ఇలా ఐశ్వర్యం వివిధ రూపాలలో వుంటుంది. అయితే **యద్యత్ విభూతిమత్సత్వం శ్రీమదూర్జితమేవ వా। తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోంశ సంభవం॥** - ఈ లోకంలో ఏదైతే ఐశ్వర్యం, తేజస్సు, బలం, సంపదలతో ప్రకాశిస్తూ వుంటుందో అదంతా నా తేజస్సు యొక్క అంశ నుండే ఉద్భవించినదని తెలుసుకో అని భగవానుడు గీతలో స్వయంగా ప్రకటించాడు. అంటే లక్ష్మి నారాయణునికి ఎప్పుడూ వేరుగా లేదు. ఆయన నుండే ఉద్భవిస్తోంది. ఆయన యందే ప్రకాశిస్తోంది. ఆయనలోనే లయమైపోతోంది. నారాయణుడు స్థితి కారకుడు. అయితే ఆయన ఈ లోకాలను నడపడానికి కావలసిన ముఖ్య ఇంధనం సంపద (లక్ష్మి) - **ధన మూల మిదం జగత్.**

అయితే, ఈ సంపదలన్నిటికంటే ఉత్కృష్టమైనది మోక్షలక్ష్మి. - **ముకుందా ముక్తి నిలయా.** ఈవిడ మోక్షాన్నిచ్చే ముకుందుని ఎల్లప్పుడూ అంటిపెట్టుకుని వుంటుంది. అసలు వారిద్దరూ ఒకే శక్తి యొక్క రెండు రూపాలు. మరి సుస్థిరమైన ఆ మోక్షలక్ష్మిని వదిలివేసి, మానవులు అస్థిరమైన లౌకిక సంపదల కోసం ప్రాకులాడుతూ, తమ సోదర మానవులపై ఈర్ష్యా ద్వేషాలను పెంచుకుంటూ వుంటారు. రామాయణంలో కథాపరంగా చూస్తే, తన కుమారునికి దక్కవలసిన రాజ్యం రామునికి దక్కుతోందని కైకమ్మ ఈర్ష్య పడింది. అలాగే ఒకవేళ భరతుని రాజుని చేసినా, రాముడు ఇక్కడే వుంటే ఈర్ష్యతో ఆ రాజ్యాన్ని దక్కించుకోవడానికి కుట్రలు పన్నుతాడేమో అని కూడా భయపడి రాముని అడవులకు పంపింది. అయితే లక్ష రూపాయలు పెట్టి ఆటో

కొనుకున్నవాడు వెనకాల 'నన్ను చూసి ఏడవకురా' అని వ్రాసుకుంటే, ఆ వెనకాల కోటి రూపాయల కారులో వెళ్ళేవాడు ఎలా నవ్వుకుంటాడో, సాక్షాత్తు లక్ష్మీపతియైన రామచంద్రుడు ఈ చిన్న అయోధ్యా నగరానికి రాజైన భరతుని చూసి ఈర్ష్య చెందుతాడు అనుకోవడం అంతే హాస్యాస్పదంగా వుంటుంది. అయితే పైన చెప్పినట్లు ఇది కేవలం కథాపరంగా మాత్రమే అనుకోండి. అసలు కైకమ్మకు ఆ బుద్ధి పుట్టడానికి వెనకాల గల దేవరహస్యం రామావతార లక్ష్యం ఆ లోగుట్టు పెరుమాళ్ళకే ఎరుక!

లక్ష్మీదేవికి ఒక విశేష లక్షణం వుంది. **ఆర్ద్రాం జ్వలన్తీ తృప్తాం తర్పయన్తీ** - తడిసిన వాటిని మండిస్తుంది. తృప్తి చెందిన వాడిని మళ్ళీ తృప్తి పరుస్తుంది. అంతులేని సంపదలో తడిసి ముద్దయిన వాడైనా, వీడి జేబులో ఐఫోన్ 12 వుండి, ప్రక్కవాడి జేబులో ఐఫోన్ 13 కనిపిస్తే వాడి గుండె భగ్గున మండుతుంది. అలాగే వీడికి రాని కాంట్రాక్ట్ ఏదో ప్రక్కవాడికి వస్తే అసూయతో రగిలిపోతాడు. ఇక ఎవరైనా కడుపునిండా, తృప్తిగా తిన్నవాడికి మరొక పిండివంట పెడతానంటే 'అమ్మో! నేను తృప్తిగా తిన్నాను. ఇహ తినలేను' అంటాడు. అదే 'ఇవాళ జేబులో వంద రూపాయలు వచ్చాయి, నేను తృప్తిగా వున్నాను' అనుకున్నవాడికి మరొక పది రూపాయలు ఇస్తే, 'ఇప్పుడు మరింత తృప్తిగా వుంది' అనుకుంటూ తీసుకుంటాడు కానీ భోజనంలాగా 'ఇక నా వల్ల కాదు' అనడు.

కాబట్టి లౌకిక పరమైన సంపద ఎంత సంపాదించినా మనకు తృప్తి కలుగదు, మనశ్శాంతి లభించదు. పైగా వీటితో భగవంతుని మెప్పించడం అసాధ్యం. అంతులేని ఐశ్వర్యం వున్న సత్యభామ తూచలేని శ్రీకృష్ణుని భక్తితో కూడిన ఒక్క తులసీదళంతో రుక్మిణీదేవి తూచ గలిగినది. కాబట్టి భక్తిలేని సంపద వ్యర్థమే. **భక్తి కలుగు కూడు పట్టెడయినా చాలు** అంటాడు వేమన. మిగిలిన లక్ష్ముల అనుగ్రహం పొందటానికి ఎన్ని సాధనలు వున్నా, మోక్షలక్ష్మీ అనుగ్రహం పొందాలంటే భక్తి ఒక్కటే సాధనం.

# నిందా స్తుతులు

సేకరణ - బొంబాయి కృష్ణారావు

ఒక రోజు వివేకానందుడు నలుగురు శిష్యులతో కలసి భిక్షకు బయలుదేరాడు. మరీ పెద్ద చప్పుడుతో కాక, ఒక మోస్తరు ధ్వనితో గంట కొడుతూ **భవతీ భిక్షాం దేహి** అని అడుగుతున్నారు. ఒక ఇంట్లో నుండి చెయ్యి ఖాళీ లేదు పొమ్మని సమాధానం వచ్చింది. ఒకామె సగం పాడైపోయిన అరటిపండు వేసింది. మరొకావిడ ఒంటి కాలుమీద లేచి తిట్టింది. శాపనార్థాలు పెట్టింది. ఊగిపోయింది. ఒకరిద్దరు మాత్రమే పాత్రలో బియ్యం పోశారు. పాడయిపోయిన అరటిపండు భాగాన్ని తొలగించి, బాగున్నంత వరకూ దారిలో కనబడిన ఆవుకు పెట్టి మఠం చేరుకున్నారు. వారి వారి పనులలో మునిగిపోయారు.

మధ్యాహ్నం భోజనానంతరం ఒక శిష్యుడు చాలా దిగులుగా గుమ్మానికి ఆనుకుని కుమిలిపోతూ వుండటాన్ని వివేకానందుడు గమనించాడు. నెమ్మదిగా అతని దగ్గరకు వెళ్ళి కారణం కోసం ఆరా తీశాడు. పొద్దున్న బిక్షకు వెళ్ళినప్పుడు ఆమె తిట్టిన తిట్లు, శాపనార్థాలు, ప్రదర్శించిన కోపం తనను చాలా బాధ పెడుతోంది, వికారంగా వుంది, తట్టుకోలేక పోతున్నాను అన్నాడాశిష్యుడు.

వివేకానందుడు అతనిచేతనే దానికి సమాధానం చెప్పించి ఓదార్చాడు.

ప్ర - మనకు భిక్షలో ఈ రోజు ఏమేమి వచ్చాయి?

జ - సగం పాడైపోయిన అరటిపండు, కొద్దిగా బియ్యం.

ప్ర - మనం మఠానికి ఏమి తెచ్చుకున్నాము?

జ - కొంచెం అరటిపండు ఆవుకు పెట్టేసి, బియ్యాన్ని మాత్రమే ఇంటికి తెచ్చుకున్నాము.

'మరి తెచ్చుకున్న వాటిల్లో తిట్లే లేనప్పుడు అవి నీవి కావు, నీతో రాలేదు. మనం తీసుకున్నది అరటిపండు, బియ్యమే కానీ, తిట్లను తీసుకోలేదు. ఇక్కడికి మోసుకుని రాలేదు. రానిదానికి, లేనిదానికి అనవసరంగా బాధ పడుతున్నావు' అని వివేకానందుడు బోధించడంతో శిష్యుడు నిజమే కదా అని తన గురువు పాదాలకు నమస్కరించాడు.

***ఎవరో ఏదో అన్నారని పదే పదే గుర్తుకు తెచ్చుకుని బాధపడకూడదు. మీరు ఎదుర్కొనే నిందలు, పొగడ్తలు ఏవీ శాశ్వతం కావని గుర్తుంచుకోండి. ప్రశాంతమైన హృదయంతో జీవించండి.***

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

శ్రీ మాతాజీవారు వారి దగ్గరకెవరైనా వచ్చి ఈ కష్టాలు దుఃఖాలు ఎప్పటికి తీరుతాయి, ఎప్పటికి మనస్సు స్థిరంగా నిలబడుతుంది అని అడిగితే సమాధానం ఈ విధంగా చెబుతారుట ఇంతకుముందు కొన్ని నెలలు, సంవత్సరాల క్రితం వున్న నీకు, ఇప్పటి నీకు తేడా ఏమైనా వున్నదా? లేదా? తప్పక వున్నది. ఎందుకంటే ప్రయత్నం వున్నది, అభ్యాసం వున్నది. నువ్వు శిక్షణలో వున్నావు. నీ ప్రయత్నం లేకపోతే, విన్నది విన్నట్లుగా పేపరులో వార్తలాగా వదిలివేసి వెళ్ళి పోతే, ప్రయత్నం చేయకపోతే మార్పు వుండదు. కానీ, శిక్షణలో, అభ్యాసంలో వున్నావు. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ ఏమన్నాడు? **అసంశయం మహాబాహో! మనోదుర్నిగ్రహంచలం అభ్యాసేనతు కౌన్తేయ! వైరాగ్యేణచ గృహ్యతే।**

మనస్సు చంచలమైనదే. కానీ, అభ్యాసం చేతగానీ, వైరాగ్యం చేతగాని రెండూ వుంటే తప్పక మనస్సు నిలుస్తుంది. ఇప్పుడు మనకి జరగటం లేదా? మనస్సు నిలకడగా వుండి అభ్యాసం చేస్తోంది. అవధూతేంద్ర స్వామివారిని హరేరామ స్వామి అని కూడా అంటారు. వారు వాడవాడలా వెళ్ళి హరేరామ నామ సంకీర్తన ప్రచారం బాగా చేశారు. ఒక వ్యక్తితో 'ఏమయ్యా! నువ్వు సంపాదిస్తున్నావు కదా, రాత్రులు కూర్చుని సంపాదించిన డబ్బు లెక్కపెట్టుకుంటున్నావు. ఒక్క అయిదు రూపాయలు తేడా వచ్చింది. ఏమైంది? దేనికి ఖర్చు పెట్టాను? అని దాన్ని గురించే ఆలోచిస్తుంటే నిద్ర పట్టదే. మరి ధ్యానానికి కూర్చుంటే మనస్సు నిలవడం లేదని అయిదు పది నిమిషాలలో లేచిపోతే అసలు నిలుస్తుందా? నీకు ఆకలి దీని మీద లేదు. బయట ప్రపంచ విషయాలమీద, పరులమీద వుంటుంది దృష్టి. అలా అయితే ధ్యానం మీద దృష్టి ఎందుకు వుంటుంది? డబ్బు మీద వున్న దృష్టి ధ్యానం మీద పెట్టి ప్రయత్నం చేస్తే మనస్సు తప్పక నిలుస్తుంది. ఆ డబ్బును కూడా ప్రకాశింపజేస్తుంది. అంటే లెక్కల్లో తేడా లేకుండా బాగా సంపాదించేటట్లు చేస్తుంది. ఈ ప్రపంచమంతటికీ ఆధారం ఆ బ్రహ్మమే. అద్వయమైన ఆ పరబ్రహ్మమే నేను అనే అనుభూతి (ప్రయత్నము, అభ్యాసము వలన) తప్పక కలుగుతుంది. అప్పుడు ఈ దృశ్య ప్రపంచమంతా అందులోనే లయించి అదృశ్యమవుతుంది.

జీవుడు ధ్యానంలో దేహమనోబుద్ధులను దాటి, ఆత్మానుభూతిలో స్థిరపడగానే, మనో వృత్తులు అణగి, ప్రశాంతతను పొందగానే, జాగ్రత్ స్వప్న సుషుప్తి అవస్థలతో కూడిన ఈ ప్రపంచం మరుగున పడిపోతుంది.

ఏ సత్య తత్వము నుండి సర్వమూ జనించి, అక్కడే వుండి, అందులోనే లీనమైపోతున్నదో, సాధకుడు ఆ సత్యతత్వమును చేరుకుంటాడు. **అహమేవాహం మాం జుహోమి స్వాహా** అను పూర్ణ మంత్రం ఇదే సూచిస్తోంది. ఇది అనుభవ వాక్యమేగానీ, అనుష్ఠాన మంత్రంలాగా చేసుకుంటూపోతే కుదరదు. ఈ మంత్రాలన్నీ కూడా తదనుభూతిని పొందే మంత్రాలు. పంచాక్షరీ, అష్టాక్షరీ, ద్వాదశాక్షరీ, షోడశాక్షరీ మంత్రాలన్నీ కూడా అనుష్ఠాన మంత్రాలు. నీ లక్ష్యాన్ని చేర్చేవి లక్షణ వాక్యాలు.

గురువు అనుగ్రహంతోనే ఇటువంటి స్థితి కలుగుతుంది. అంతగొప్పది గురువు అనుగ్రహం! వారి సన్నిధానంలో, వారితో వుంటే చిన్న చిన్న అనుభవాల ద్వారా గురుదేవులు ఎలా భక్తులకు అనుకోని విధంగా ఆనందాన్ని ప్రసాదిస్తారో, శ్రీ మాతాజీవారు చెప్పారు. ......... పడుకునే నిద్రపోవనక్కర్లేదు. కొంతమంది కూర్చుని, నిల్చుని కూడా నిద్రపోగలరు. స్వామివారు ప్రబోధన చేసే సమయంలో (దసరా ఉత్సవాలలో) ఒక భక్తుడిని లేపి, వారిచేత చెప్పిస్తూ మధ్యలో స్వామివారు మాట్లాడే సమయంలో ఆ భక్తుడు పాపం! ఉత్సవాలలో పాల్గొన్న అలసట వలనో ఏమో నిల్చుని కూడా నిద్రపోయేవారు. శ్రీబాబు వారి మీద పండ్లు అవీ ఏవుంటే అవి విసరి మేల్కొలిపి వారి బోధను కొనసాగించేవారు. అలాగే మాతాజీవారు వారి అనుభవాన్ని కూడా చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా ముంజవరపు కొట్టు మహాశివరాత్రి ఉత్సవాలు రాత్రి తెల్లవార్లూ గోదావరి నది మీద పడవలు కట్టి, వాటి మీద స్వామివారికి పూజ జరిగేది. ఆ తరువాత నదీ స్నానాలు, స్వామివారికి అక్కడే నదీ జలాలతో అభిషేకం జరిగేవట. సరే ఇవన్నీ ముగిసిన తరువాత స్వామివారు గుండుగొలను వెడుతూ మాతాజీవారిని ముంజవరపుకొట్టులోనే వుండిపొమ్మని చెప్పారుట. కానీ, వారికి గురుదేవులతో వెళ్ళాలని ఎంతగానో అనిపించి, వారిని మళ్ళీ అడిగితే తీసుకు వెడతారనే ఆశతో వారి బట్టల సంచీతో సహా పడవ ఎక్కారుట. స్వామివారికి ఒక పడవలో కుర్చీ వేశారు. కానీ, వారు ఆ పడవ మీదకు రాకుండా, మాతాజీ వున్న పడవ ఎక్కారు. మాతాజీవారిని చూసి, వారికి ఏమీ మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండానే, నువ్వు ముంజవరపుకొట్టుకు తిరిగి వెళ్ళిపోతున్నావు అని అంటూ ఒక పండు వారు స్వీకరించి, మాతాజీవారికి విసరారు. అమ్మకు ఒక ప్రక్కన బాధగా అనిపించినా, ఆ ప్రసాదంతో ఎంతో ఆనందం, మనస్సుకు సమాధానం కలిగాయి.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**అక్టోబర్ 2021 -**

1 శుక్ర - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

5 మంగళ - మాసశివరాత్రి

6 బుధ - అమావాస్య

7 గురు - శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం. ఉ. 8-28 గం.లకు అంకురార్పణ.

12 మంగళ - మూలానక్షత్రం - సరస్వతీ పూజ. సామూహిక కుంకుమ పూజలు.

13 బుధ - దుర్గాష్టమి -

14 గురు - మహర్నవమి -

15 శుక్ర - విజయదశమి - సామూహిక కుంకుమ పూజలు. నామకరణాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు.

16 శని - ఏకాదశి - ఏకాహం, దీక్షావిరమణ, అక్షతలు, నగరోత్సవం, శ్రీసద్గురుపాదపూజ.

20 బుధ - ఆశ్వయుజ పూర్ణిమ - శ్రీ మాతాజీ జన్మదిన మహోత్సవం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

30 శని - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

**నవంబర్ 2021 -**

3 బుధ - మాస శివరాత్రి, నరకచతుర్దశి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

4 గురు - దీపావళి - అమావాస్య - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట.

5 శుక్ర - కార్తీక శుద్ధ పాడ్యమి - ఆకాశదీప ప్రారంభం.

7 ఆది - నవంబర్ 7 నుండి 17 వరకు శ్రీరామలింగేశ్వర స్వామి వారికి పంచామృతాలు, నవరసాలతో ఏకాదశ రుద్రాభిషేకములు, లక్షబిల్వార్చన.

8 సోమ - నాగుల చవితి

15 సోమ - చిలుక ఏకాదశి - ఏకాహం, శ్రీసద్గురుపాదపూజ, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతములు, భక్తసమారాధన

16 మంగళ - క్షీరాబ్ది ద్వాదశి - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

18 గురు - జ్వాలాతోరణం, శ్రీరామలింగేశ్వరస్వామివారి నగరోత్సవం

19 శుక్ర - (కార్తీక) గురు పూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

22 సోమ - నవంబర్ 22 నుండి 29 వరకు శ్రీ సద్గురుదేవుల ఆరాధనా మహోత్సవములు.

29 సోమ - శ్రీ గురుదశమి - శ్రీ సద్గురుదేవుల మహాభిషేకము, శ్రీసద్గురు పాదపూజ, దీపోత్సవము, శ్రీసద్గురు ఆరాధన.

30 మంగళ - శ్రీసద్గురు దీక్షలో వున్నవారికి హోమం.

డిసెంబర్ 1 బుధ - హోమం పూర్ణాహుతి, దీక్ష విరమణ

# శ్రీ మూర్తి నాయనారు

సేకరణ - మురళి

పాండ్య రాజధాని మధురైలో జన్మించిన శ్రీ మూర్తి నాయనారు అత్యంత శివ భక్తుడు. శివునికి ప్రతిరోజు చందనం అద్ది అర్చించటం నిష్ఠగా పెట్టుకున్నారు. ఒక రోజు జైన మతస్థుడైన కర్ణాటక రాజు మధురైపై దండెత్తి పాండ్య రాజును జయించాడు. ఈ రాజు దేశంలోనుంచి శైవమతాన్ని నిర్మూలించాలని నిర్ణయించుకుని ప్రజలందరినీ జైన మతము స్వీకరించమని ఆదేశించి, నిరాకరించిన వారిని హింసించమని ఆదేశించాడు. మూర్తి నాయనారు రాజు ఆదేశాలకు భయపడకుండా చందనముతో శివుని అర్చన మానకుండా నిత్యమూ చేస్తూనే ఉన్నాడు. మూర్తి నాయనారును ఎలాగైనా జైన మతంలోనికి మార్చాలని, ఊరిలో ఎవ్వరూ చందనం అమ్మకూడదని ఆజ్ఞాపించాడు. మూర్తి నాయనారుకు ఈ ఆజ్ఞ అశనిపాతంలా తోచింది. “హే మహేశ్వరా! ఈ రాజు శివభక్తుల బ్రతుకు దుర్భరం చేశాడు. బ్రతకనివ్వటంలేదు. ఈ దేశానికి శివభక్తుడైన రాజును అనుగ్రహించి నీ భక్తులను కాపాడుకోవయ్యా!” అనిప్రార్థించాడు.

ఒక రోజు మూర్తి నాయనారు చందనం కొరకు ఊరంతా తిరిగినా ఎవ్వరూ చందనం అమ్మలేదు. ఎంతో పరితపించి నిస్పృహతో దేవాలయం చేరుకున్నాడు. ఏమీ దొరకకపోతే నా స్వామికి అర్చన ఎలా అనుకుని తన చేతులనే చందనంగా అరగదీయటం మొదలు పెట్టాడు. చర్మం అరిగిపోయి ఎముకలు అరగటం మొదలుపెట్టాయి. ఆలయమంతా రక్తం పారింది. అయినా ఆపకుండా చేతులను అరగదీస్తుంటే, భక్త సులభుడైన శివుడు అనుగ్రహించి “మూర్తి నీ భక్తి అచంచలమైనది. నీవు చేతులను అరగదీసే సాహసము ఆపు. నీ కష్టాలు అన్నీ తీరి, నీవే రాజువుకాగలవు. శైవమతమును ఉద్ధరించి, న్యాయముగా రాజ్య పరిపాలన చేసి చివరకు నన్ను చేరుకొనగలవు” అని చెప్పాడు. .మూర్తి నాయనారు చేతులు పూర్వపు స్థితికి వచ్చేశాయి. తాను ఎప్పుడూ రాజు కావాలని కోరుకోలేదే! అని ఆశ్చర్య పడ్డాడు.

దైవ నిర్ణయం ప్రకారం ఆ రాత్రి జైన మతస్థుడైన రాజు మరణించాడు. మరునాడు ఆచారం ప్రకారం మంత్రులు

పట్టపుటేనుగుకు పూలమాల యిచ్చి నగరమంతా త్రిప్పటం మొదలుపెట్టారు. ఆ ఏనుగు ఎవరిమెడలో మాల వేస్తే వారు రాజు అవుతారు. ఆ ఏనుగు నగర సంచారం చేస్తూ దేవాలయం సమీపంలోకి వచ్చిన సమయంలో మూర్తి నాయనారు శివార్చన కొరకు పువ్వులు తీసుకుని వచ్చాడు. ఏనుగు నాయనారుకు ఎదురు వెళ్ళి, పూలమాలవేసి, తనపైకి ఎక్కించుకుని, రాజమహలుకు తీసుకువెళ్ళింది. మంత్రులందరూ చేరి నాయనారును రాజ్యాధిపత్యం వహించమని వేడుకున్నారు. వారి ప్రార్ధనను అంగీకరించి, నిరాడంబరముగా ఉంటూ, ధర్మ పరిపాలన గావించి, చివరకు శివసాయుజ్యము చెందారు. వారి పరిపాలన కాలములో ప్రజలందరూ ఎప్పటిలా శైవమతమును స్వీకరించి అత్యంత భక్తితో శివార్చనలు చేస్తూ సుఖముగా ఉన్నారు.



మన ఆశ్రమ హాస్పిటల్లో క్రొత్తగా డిజిటల్ ఎక్సరే సమకూర్చబడినది. ఇందుకు సహకరించిన భక్తులకు ధన్యవాదములు!

**మన ఆశ్రమ హాస్పిటల్ డాక్టర్లు మరియు సిబ్బంది అవసరార్థులకు నిరంతరం వైద్యసేవ అందిస్తూ వున్నారు. ఆగస్టు 2021లో 1200 పేషంట్స్‌కి ఉచితంగా వైద్యసేవలు అందించటమే కాకుండా, 110 స్కానింగులు, 37 కాన్పులు (ఇప్పటి వరకు నమోదు చేయబడిన నెలవారీ కాన్పులలో అత్యధికం) పూర్తిగా ఉచితముగా చేయడం జరిగింది. ఇంత పెద్ద ఎత్తున వైద్య సేవలు అందించిన వైద్యులకు, ఇతర సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే ఈ మహత్కార్యానికి సహాయ సహకారాలు అందించిన భక్తులు మరియు దాతలకు శ్రీ గురుదేవులు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.**

**కార్య నిర్వాహక వర్గము**

**SHKVPB Trust Hospital**

# సగటు మనిషి ఆత్మ వివేచన

- దేవరకొండ నాగేశ్వరరావు

**గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః। గురుర్దేవో మహేశ్వరః।**

**గురు స్సాక్షాత్పర బ్రహ్మా। తస్మై శ్రీ గురవే నమః॥**

ఈ శ్లోక తాత్పర్యం సగటు మనిషికి కూడా స్థూలంగా అవగతమే. 'సకల చరాచర జీవులలోనూ ఆ పరమాత్మయే కొలువై వున్నాడు' అన్నది జగమెరిగిన సత్యం. అద్వైత భావనా ప్రాప్తికి ప్రాథమిక సాధనం ద్వైత భావనయే.

ఆధ్యాత్మిక ప్రబోధములు, ఉపన్యాసములు ఎన్నెన్ని విన్నా, సగటు మనిషికి మనసులో స్థిరపడటం కష్టం. సర్వసాధారణంగా మానవునకు మరపు అనేది సహజ లక్షణం కదా! అందువలన ఆధ్యాత్మిక బోధనలు ఉపన్యాసముల లోని ముఖ్యాంశాలు మనసులో తర్కించుకుంటూ వుండాలి. సత్సంగంలోని వారితో చర్చించుకుంటూ వుంటే మనసులో బాగుగా పాదుకొంటుంది. మరికొంత కాలానికి స్థిరపడుతుంది.

స్థిరత్వం ఏర్పడే లోపుగా ఎన్నో ఒత్తిళ్లను, పరీక్షలను ఎదుర్కో వలసి రావచ్చు. సద్గురునామ స్మరణ ధారణ చేస్తూనే వుండాలి. ఎన్నెన్ని పనులున్నా సద్గురుమూర్తి యొక్క నిదిధ్యాసను వీడరాదు. సద్గురుమూర్తిని గానీ, నమ్మిన ఏ ఇతర దేవతామూర్తిని గానీ, త్రికరణ శుద్ధిగా నమ్మి విస్మరించకుండా స్మరిస్తూనే వుండాలి.

సత్యం, శాంతి, దయ స్వభావాలను పాటిస్తూ, చేతనయినంత వరకూ ఇతరులకు సహాయపడుతూ వుండాలి. ఇవి మానవత్వ లక్షణాలు కదా! వీటిని అలవరచుకొన్నవాడే యోగ్యుడైన సాధకుడు. నమ్ముకొన్న ఆ సద్గురుమూర్తి అనుగ్రహిస్తాడు కూడా.

రాజబాట ప్రక్కన ఒక వేప చెట్టు క్రింద పడి వున్న రాతిని కడిగి, పసుపు కుంకుమల నలది ఒక దేవతగా నమ్మి భక్తి భావనతో మ్రొక్కి నివేదనలు చేసే భక్తులు కూడా వున్నారు. దేనికైనా నమ్మకం, విశ్వాసం అనేవి ప్రధానం.

అటువంటి ఆ దైవమే సద్గురు మూర్తిగా సాక్షాత్కరించిన శుభ తరుణాన్ని సద్వినియోగ పరచుకోక పోవడం ఎంత అవివేకం!

ఎంత దురదృష్టకరం!

సద్గురు నామ ధారణ చేసిన సాధకుడు ధన్యుడవుతాడు. సాధకుడు కర్తృత్వం తనపై వేసుకోకూడదు. ఫలాపేక్ష రహితంగా కర్మను పనులను చేయాలి. అలా అలవరచుకోవాలి.

యోగ్యుడైన సాధకుని ఇహ పరాలను గురించిన బాధ్యత సద్గురు రూపంలో వున్న దైవమే చూసుకుంటాడు.

భగవంతుడు కూడా క్షమించని మానవ తప్పిదాలను క్షమించ గల శక్తి స్వరూపుడు సద్గురుమూర్తి మాత్రమే!!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**అక్టోబర్ 2021-**

1 శుక్ర - శ్రీగురుదశమి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

13 బుధ - దుర్గాష్టమి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

14 గురు - మహర్నవమి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

15 శుక్ర - విజయదశమి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

20 బుధ - ఆశ్వీయుజ పూర్ణిమ - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

30 శని - శ్రీగురుదశమి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

**నవంబర్ 2021-**

3 బుధ - నరక చతుర్దశి

4 గురు - దీపావళి - ఉ. 11గం. శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

8 సోమ - నాగులచవితి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

15 సోమ - చిలుక ఏకాదశి -సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

16 మంగళ - క్షీరాబ్ది ద్వాదశి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

19 శుక్ర - కార్తీక గురు పూర్ణిమ - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

29 సోమ - శ్రీగురుదశమి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీహరి రావుగారితో శ్రీ బాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

6-11-1966 : (మేడబాబుగారింట్లో) సూర్యనారాయణ శాస్త్రిగారితో “శంకరాభరణం, హంసధ్వని, మోహన, యమునాకళ్యాణి రాగాలను నువ్వు చక్కగ వయోలిన్ మీద ఆలాపన చేస్తూ ఉండు. నేను అది వింటూ స్నానం చేసి వస్తాను” అని వెళ్ళారు. వారు వాయిస్తుండగా, స్నానం చేసి వస్తూనే నృత్యం చేస్తూ **“చక్కనైన కాళీబాబుని ఎక్కడైనా చూశారా? ఇక్కడేనయా! ఇతడేనయా!”** అని పాడటం మొదలు పెట్టారు. తరువాత **“నీ గుణగానము”** అనే పాట పాడమని, “ఈ ఒక్కపాట మనసారా పాడుకుంటూ మననం చేసుకుంటే చాలు. సాధనకు ఇంతకంటె వేరేమీ అవసరం లేదు.



సినిమా పాట అయితే మాత్రమేమి? అటువంటి సినిమా చూస్తే మంచిదే. అది సినిమా -(శని+మా) శని - మానవునికి పట్టిన శనిని, అంటే ఆవరించిన మాయను , మా -రహితం చేసేది అవుతుంది. అది లేని సినిమాలు శని మాత్రమే” అన్నారు.

12-11-1966 : దీపావళి - భీమవరం తాతయ్యగారింట్లో - పచ్చిమిరపకాయ (అదొక రకం టపాకాయ)ను అంటించి “చూశారా! అది ఎటువైపు వెడుతుందో, ఎవరి ఒడిలో దూరుతుందో తెలియదు. మతిలేని వారి ప్రవర్తన కూడ అలాగే ఉంటుంది” అన్నారు.

28-11-1966 : కార్తీక పూర్ణిమకు శ్రీ బాబు భక్తులందరితో అమరావతీ క్షేత్రానికి వెళ్ళారు. అక్కడ నుండి నావపై కృష్ణానదిలో ప్రయాణం చేసి వైకుంఠ పురం చేరారు. అక్కడ స్నానాలు చేశారు. “అటు అమరావతిలో అమరేశ్వర స్వామికి, యిటు వైకుంఠ పురంలో వేంకటేశ్వరునికి మధ్యన మనం నిలిచి యీ రెండు పురాలను కలుపుతున్న హరి హరుల అభిన్నత్వాన్ని తెలుపుతూ ప్రవహించే కృష్ణలో స్నానం చేస్తే, కుమారస్వామి, అంటే స్కందుడు పొందిన దివ్య అద్వైతానుభూతిని మనం పొందగలము. స్కందుడు తండ్రియైన పరమేశ్వరునే తన గురువుగా ఆశ్రయించి, ఆ గురు కటాక్షమున తాను పొందిన అనుభూతిని, తన గురుదేవులైన శివునితో మనవి చేసుకున్నాడట. అదేదో ఉపనిషత్తు ;

ఏమిటయ్యా అది వెంకటరత్నం?" అని శ్రీ బాబు అడిగారు. వెంకటరత్నం "స్కందోపనిషత్తు బాబూ!" అని చెప్పారు. "నువ్వు అది చదువు. తారకం! నువ్వు అర్థం చెప్పు" అని బాబు ఆ ఉపనిషత్తుకు అర్థం చెప్పించారు.

"చూశారా! శివునికి, విష్ణువుకు అభేదము తెలిపేదే జ్ఞానము. శివ తత్త్వము అంటే విష్ణు తత్త్వము సర్వే సర్వత్రా అన్ని జీవ రాసులలోను కూడ నిండి యున్నది గనుక , జాతి, కుల, గోత్ర భేదములను మరచి, మానవునికి మానవునికి మధ్య భేద బుద్ధిని విడచి, సర్వజీవులను సమ భావంతో చూడటమే జ్ఞానం. అలాగే ధ్యానము అంటే మనస్సులో ఎటువంటి సంకల్పములు, కోరికలు, విషయ వాసనలు లేకుండా శుద్ధ మనస్సుగా ఉంచుకోవటమే. శుద్ధ మనస్సు మళ్ళీ మలిన మనస్సు అవదు. అయితే అది శుద్ధ మనసే కాదు. మామూలు స్నానం ఎన్ని సార్లు చేసి, ఎన్ని సబ్బులు అరగదీసినా శరీరానికి పట్టిన మలినమే సరిగా పోదు. పోయినా, మళ్ళీ కొంచెం సేపటిలోనే తయారు. ఇక మనస్సుకు అంటిన మలినమును, అంటే విషయ వాసనలను యీ మామూలు స్నానం ఎలా వదిలించ గలదు? ఆ మనస్సుకు పట్టిన మకిలి వదలాలంటే భగవన్నామ రసాయనంతో మనస్సును నింపాలి. అదే నిజమైన స్నానము. ఈ స్నానం ఒకసారి చేస్తే మళ్ళీ అవసరం లేదు. ఇక మడిని గురించి అంటే శుచిని శుభ్రతను గురించి ఏమి చెప్పారయ్యా?" అని అడిగారు. "**శౌచమింద్రియ నిగ్రహః**" (వెంకట రత్నం). "అంటే యింద్రియాలను కంట్రోలులో అంటే అదుపులో ఉంచుకోవటమే. అదే నిజమైన మడి, నిజమైన శుభ్రత. ఆ మడి కట్టుకున్న వాడికి ఏ మైలా (కోరికలు, సంకల్పాలు) అంటదు.

ఈ ఉపనిషత్తులూ వేదాలూ తెలియకపోయినా, అవి చెప్పినట్లు గోపికలు, శబరి, నందనారు, గుహుడు మొదలైన భక్తులందరూ ఆచరించారు. వాళ్ళంతా తమ మనస్సులలో ఉన్న అన్ని కోరికలను, సంకల్పాలను తుడిచి వేసి, రామ నామ రసాయనంతో నింపుకున్నారు. ఇంద్రియాలను అదుపులో ఉంచుకున్నారు. "**బ్రహ్మామృతం పిబేత్**" - రామ నామమనే బ్రహ్మామృతాన్ని వాళ్ళు సేవించారు. మరి వాళ్ళు అమృతత్వాన్ని పొందుతారా? లేక మనస్సులో విషయ వాంఛలన్నీ నింపుకుని, పైకి మాత్రం వేదాలు, ఉపనిషత్తులు చదువుతూ, విభూతులు, త్రిపుండ్రాలు, తులసి పూసల పేర్లు, రుద్రాక్షమాలలు ధరించిన వాళ్ళు అమృతత్వాన్ని పొందుతారా? మీరే చెప్పండి" అన్నారు శ్రీ బాబు. - సశేషం

విష్ణు  కథలు -రమణ ప్రసాద్

# శ్రీ కులశేఖరాళ్వారులు

భగవదనుగ్రహం చేత దైవదర్శనం చేసి ఆత్మజ్ఞానాన్ని పొందిన వారే ఆళ్వారులు. "ఆళ్వార్" అనగా మునిగినవాడని అర్థం. అంటే భగవదనుగ్రహంలో మునిగినవారు ఆ ఆళ్వారులు. వీరు భగవంతుడిని దర్శించి, భగవంతుని దివ్య మంగళరూపాన్ని చూసి భగవంతుని గుణగానం చేశారు. భగవంతుని నిత్యం అనుభవిస్తూ, స్వామికి అర్పణ చేసికొని, భగవంతుని ఆనందింపజేసి, ఆ ఆనందాన్ని దర్శిస్తూ ఉండటమే వీరికి మోక్షం. వీరిది రాగాత్మకమైన భక్తి. అట్టి ఆళ్వారులు పదిమంది - భూత, సరోమహాయోగులు, భట్టనాథులు, శ్రీభక్తసారులు, శ్రీకులశేఖరులు, యోగవాహనులు, భక్తాంఘ్రి రేణువు, పరకాలురు, పరాంకుశులు. వారితో భట్టనాథుని కుమార్తె ఆండాళ్, పరాంకుశులవారి శిష్యులు మధురకవులు చేరి పన్నెండు మంది ఆళ్వారులయ్యారు.



శ్రీ కులశేఖరులు క్షత్రియ వంశానికి చెందినవారు. వీరి తండ్రి దృఢవ్రత మహారాజు.ఆయన కేరళ దేశాన్ని తిరువాన్కూర్ రాజధానిగా చేసికొని పరిపాలించారు. వీరి ఆరాధ్య దైవం అచట వెలిసిన పద్మనాభస్వామి. దృఢవ్రతునికి జన్మించిన కుమారుడు శ్రీ కులశేఖరులు. వీరు పుట్టిన ఊరు తిరువంజిక్కళం(కొల్లినగరం). వీరు తమ తండ్రిగారి తర్వాత రాజ్యాధికారంలోకి వచ్చారు. భగవదనుగ్రహం వల్ల వారికి దివ్యజ్ఞానం కలిగింది. ఆ రాజ్యమంతా పద్మనాభునిదే.

శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణ భగవానుడే వారి ఆరాధ్య దైవాలు. భగవత్సేవ, భగవద్భక్తుల సేవ, భగవద్గుణ స్మరణలు వారి నిత్య కర్తవ్యాలు.

రాజ్యం వదలి శ్రీ రంగానికి వెళ్ళి నిత్యం స్వామిని సేవించాలని శ్రీరంగానికి ప్రయాణం కట్టేవారు. కాని రాజ్యపాలన కుంటుపడుతుందని మంత్రులు నిరోధించేవారు. అందుకై వారు పౌరాణికులచేత భగవత్కథలు వినిపించేవారు. ఆ కథలు వింటూ తమ స్థితిని మరచిపోయేవారు. రామాయణ గాథ వింటుంటే, అది అప్పుడే జరుగుతున్నట్లు మనో ఫలకంలో దర్శించేవారు. ఖరదూషణాదులు, పదునాల్గువేల రాక్షసులతోయుద్ధం చేస్తున్న ఘట్టాన్ని పౌరాణికులు చదువుతుంటే తానుకూడా సహాయం చెయ్యాలని సంసిద్ధుడయ్యేవాడు. అప్పుడు పౌరాణికులు వెంటనే ఖరదూషణాదులను సంహరించి యుద్ధంనుంచి తిరిగి వచ్చిన సన్నివేశాన్ని వర్ణించేవారు. కులశేఖరులు ఎంతో ఆనందం పొంది తన ఉద్యమాన్ని విరమించేవారు. అలాగే రావణుడు సీతను హరించిన ఘట్టం విని, తాను శ్రీరామునికి బాసటగా నిలిచి యుద్ధం చేయాలని సంకల్పించారు. పౌరాణికులు వెంటనే శ్రీరాముడు రావణ సంహారం చేసిన వర్ణన చదువగా తమ ప్రయత్నం విరమించేవారు.

శ్రీ కులశేఖరులు జన్మ రాహిత్యాన్ని కోరుకోలేదు. ఎన్ని జన్మలెత్తినా, “స్వామీ! నీ పాదములయందు నిశ్చల భక్తిని ప్రసాదించమ”ని కోరుకొన్నారు. “నీ పాదములను గూర్చిన స్మరణ తొలగకుండాచేయమ”ని కోరినారు. “నీ పాద పంజరంలో నా మనస్సు నిలిస్తే చాల”ని ప్రార్థించారు.

“నేను నా జన్మలో పొందవలసింది ఒక్కటే. **త్వభృత్య, భృత్య పరిచారక భృత్య భృత్య భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ**– “నన్ను నీ భృత్యుల, పరిచారకుని భృత్యుల, భృత్యుల దాసునిగా చేసికొమ్మని”నారు.

- సశేషం

# భక్త మహాశయులకు విజ్ఞప్తి

సమర్ధ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ వారు భక్తులందరికీ ప్రసాదించిన మహా ప్రసాదం "శ్రీ దేవీ నవరాత్రి మహెూత్సవములు". ఈ సంవత్సరం ది.07.10.2021 నుండి ది.16.10.2021 వరకు శ్రీకాళీవనాశ్రమంలో జరుగనున్నవి. వార్షికంగా పాల్గొంటున్న భక్తులు on line లో వారి పూజలు ముందుగా నమోదు చేసుకొనే ఏర్పాటు ఈ సంవత్సరం కూడా చేశాము. పూజ రుసుము చెల్లించటానికి ఈ QR కోడ్ స్కాన్ చేసి phone pay/ Google pay/ paytm ద్వారా పంపవచ్చును. తరువాత మీ గోత్రము, పేరు, పూజ చేసుకొనే తేదీ, 8333067877 నంబరుకి మెసేజ్ పెట్టాలి. బ్యాంక్ ద్వారా పంప దలిచేవారు ఈ ఫోన్ నంబరుకి ఫోన్ చేసి అకౌంట్ నంబరు తెలుసుకొనగలరు.




Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD